సాక్షి అనంతపురం

బుధవారం ׀ 26 ׀ మార్చి ׀ 2025



చీనీ టన్ను రూ.25,020

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.25,020 పలికాయి.



టమాట కిలో రూ.8

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.8 పలికింది. కనిష్టం 6, సరాసరి రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



న్యూస్‌రీల్

బెంగళూరు-కలబురిగి మధ్య ప్రత్యేక రైలు



గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 28, 29వ తేదీల్లో బెంగళూరు-కలబురిగి మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఏ.శ్రీధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 28న బెంగళూరు జంక్షన్ నుంచి రాత్రి 9.15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.40 గంటలకు కలబురిగి జంక్షన్‌కు రైలు చేరుతుందన్నారు. తిరిగి 29వ తేదీ ఉదయం 9.35 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి అదే రోజు రాత్రి 8 గంటలకు బెంగళూరు జంక్షన్ చేరుకుంటుందని తెలిపారు. యలహంక, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, కృష్ణా, యాదగిరి, షాహాబాద్ రైల్వేస్టేషన్ల మీదుగా రైలు రాకపోకలు సాగిస్తుందన్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి చిన్నారి బలి



అభినయశ్రీ (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ఓ చిన్నారిని బలిగొంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మండల పరిధిలోని కొత్తూరు గ్రామానికి చెందిన ఈరన్న, రేణుకమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. ఇటీవల ఈరన్న ఇంటి సమీపంలో విద్యుత్ తీగ కిందకు వాలింది. ఈ విషయంపై పలు మార్లు విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదు. మంగళవారం బలంగా వీచిన గాలులకు తీగ పూర్తిగా తెగి కింద పడడంతో ఆ ప్రాంతమంతా విద్యుత్ సరఫరా అయింది. అదే సమయంలో అక్కడికి ఆడుకుంటూ వెళ్లిన ఈరన్న కుమార్తె అభినయశ్రీ (6) షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చిన్నారిని కళ్యాణదుర్గం సీహెచ్‌సీకి తరలించగా... పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. చిన్నారి మృతితో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

'నవోదయ' ఫలితాల విడుదల



లేపాక్షి: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షా ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. పరీక్షకు 7,987 మంది దరఖాస్తు చేసుకోగా, 5,492 మంది పరీక్ష రాశారు. అందులో 80 మంది అర్హత సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ఫలితాల కోసం విద్యాలయ వెబ్‌సైట్ చూడాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

9వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయలో 9వ తరగతి ప్రవేశం కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను కూడా అధికారులు విడుదల చేశారు.

పేదలపై సీఎం చంద్రబాబు కక్ష కట్టారు. అదిగో ఇదిగో అంటూ ఇప్పటికే సంక్షేమ పథకాల అమలును వాయిదా వేస్తున్నారు. కొత్తవి సంగతి దేవుడెరుగు గతంలో పేదల కోసం అమలు చేసిన పథకాలకూ మంగళం పాడుతున్నారు. గత ప్రభుత్వం ఎంతో సదుద్దేశంతో ప్రవేశ పెట్టిన 'విదేశీ విద్యా దీవెన' పథకంపై కనీసం నోరు మెదపకపోవడమే ఇందుకు నిదర్శనం. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.



విదేశీ విద్య.. మిథ్య!

- పైసా విదల్చని కూటమి సర్కారు
- పేద బిడ్డల పట్ల నిర్దయగా వ్యవహరిస్తున్న వైనం
- ఇప్పటికే విదేశాలకు వెళ్లిన వారికీ చెల్లింపులు బంద్
- విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన
- ఎన్నికల ముందు వచ్చిన దరఖాస్తులు బుట్టదాఖలే?

అనంతపురం: పేద పిల్లలకూ విదేశాల్లో ఉన్నత చదువులు అందించాలనే గొప్ప ఆలోచనతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'జగనన్న విదేశీ విద్యా దీవెన' పథకాన్ని అమలు చేసింది. 2022-23, 2023-24 విద్యా సంవత్సరంలో మొత్తం రూ.1.47 కోట్లను జిల్లాకు చెందిన విద్యార్థులకు అందజేసింది. అయితే, గతేడాది విదేశాలకు వెళ్లిన విద్యార్థులకు నాలుగు విడతల్లో ఫీజు మొత్తాన్ని అందించాల్సిన తరుణంలో కూటమి సర్కారు రావడంతో పరిస్థితి ఒక్కసారిగా తలకిందులైంది.

పైసా విదల్చలేదు..

అధికారం చేపట్టి 9 నెలలు అయినప్పటికీ పైసా విదల్చకుండా కూటమి సర్కారు లక్ష్యాన్ని నీరుగారుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో విదేశాలకు వెళ్లిన విద్యార్థులకు డబ్బులు ఇవ్వడం ఆపేసింది. కొత్తగా విదేశాలకు వెళ్లిన విద్యార్థులు చేసుకున్న దరఖాస్తులను సైతం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ సాయానికి గతేడాది జనవరి నుంచి పేద విద్యార్థులు పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. వాటిలో కొన్ని దరఖాస్తుల పరిశీలన పూర్తికాగా, మరికొందరికి ఇంటర్వ్యూలు సైతం నిర్వహించారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ పేరుతో నిధుల విడుదలను నిలిపివేశారు. ప్రభుత్వ సాయం అందుతుందన్న ఆశతో ఇంటర్వ్యూ పూర్తయిన చాలా మంది విద్యార్థులు అప్పులు చేసి మరీ విదేశాలకు వెళ్లారు. నెలలు గడుస్తున్నా సాయం అందించే విషయంపై స్పష్టత రాకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు వినతి పత్రాలు అందించినా ఫలితం కానరాకపోవడం గమనార్హం.

గతంలోనూ ఇంతే..

గతంలో చంద్రబాబు నేతృత్వంలో ఏర్పడిన టీడీపీ ప్రభుత్వంలోనూ అగ్రవర్ణ పేదలను విస్మరించారు. మిగిలిన వారికి కూడా కేవలం రూ.15 లక్షల చొప్పున సాయం అందించి చేతులు దులుపుకున్నారు. అదే జగన్ సర్కార్ ఒక్కొక్కరికి రూ.కోటి నుంచి రూ.1.25 కోట్ల వరకు సాయం అందించింది. అగ్రవర్ణ పేదలతో పాటు కాపులు, ఎస్సీ, ఎస్టీ , బీసీ, మైనార్టీలకు 'జగనన్న విదేశీ విద్యా దీవెన' పథకం ద్వారా విదేశాల్లో చదువులకు ఊతమిచ్చారు. ప్రపంచంలో టాప్-50 క్యూఎస్ ర్యాంకింగ్ సాధించిన యూనివర్సిటీల్లో సీటు పొందిన విద్యార్థులకు ఈ పథకాన్ని వర్తింపజేశారు. ఎంపికైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఒక్కొక్కరికి గరిష్టంగా రూ.1.25 కోట్ల వరకు, కాపు, ఈబీసీ విద్యార్థులకు రూ.కోటి వరకు ఆర్థిక సాయం అందించారు. నాలుగు విడతల (సెమిస్టర్)లో ఈ మొత్తాన్ని విద్యార్థుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. విద్యార్థుల ప్రయాణానికి అవసరమైన ఖర్చులను సైతం ప్రభుత్వమే చెల్లించింది. పీజీ, పీహెచ్‌డీ కోర్సులతో పాటు విదేశాల్లో ఎంబీబీఎస్ కోర్సులకూ పథకాన్ని వర్తింపజేశారు. అటువంటి గొప్ప పథకాన్ని నీరుగార్చేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుండడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పోర్టల్ తెరుచుకోవడం లేదు

ప్రభుత్వ సాయం అందుతుందని మా అబ్బాయిని విదేశీ చదువుకు పంపించా. కూటమి ప్రభుత్వం వచ్చాక విదేశీ విద్యకు సాయం అందించలేదు. కనీసం మా దరఖాస్తు ఏమైందో తెలుసుకుందామంటే జ్ఞానభూమి పోర్టల్ తెరుచుకోవడం లేదు. సమాధానం చెప్పే నాథుడే లేడు. సాయం అందించకపోతే అబ్బాయి చదువు కోసం అప్పులు చేసి అవస్థలు పడక తప్పదు.

– విజయభాస్కర్, చిరుద్యోగి, అనంతపురం

ఇస్తారో లేదో చెప్పాలి?

మా అమ్మాయిని విదేశాల్లో డాక్టర్ చదివిద్దామని సాయం కోసం దరఖాస్తు చేసి నాలుగు నెలలు దాటింది. ఆ దరఖాస్తు ఏమైందో తెలియదు. విదేశీ విద్యా దీవెన పథకాన్ని కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుందా.. లేదా.. అనే అంశంపై స్పష్టత లేదు. అసలు సాయం అందిస్తారో లేదో చెబితే.. మా తిప్పలు మేం పడతాం.

– ఓబుళ రెడ్డి, మాజీ ఆర్మీ ఉద్యోగి, శ్రీ సత్యసాయి జిల్లా

ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

- చిన్న పొరపాటుకూ తావివ్వొద్దు
- జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి



అధికారులతో సమావేశమైన సీఈఓ రామచంద్రారెడ్డి

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తొమ్మిది మండలాల్లో ఈ నెల 27న జరగనున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికల ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి(సీఈఓ) రాజోలి రామచంద్రారెడ్డి, ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి జి.వెంకటసుబ్బయ్య ఆదేశించారు. మంగళవారం అనంతపురం జిల్లా పరిషత్ కార్యాలయంలోని సీఈఓ చాంబర్‌లో ప్రిసైడింగ్ అధికారులు, ఎంపీడీఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రొద్దం, గాండ్లపెంట, రామగిరి, కణేకల్లు, కంబదూరు మండలాల్లో ఎంపీపీ ఎన్నికలు,ఉరవకొండ, పెద్దపప్పూరు, యల్లనూరు, రాయదుర్గం మండలాల్లో వైస్ ఎంపీపీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా మండలాల్లో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఎన్నికల్లో ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. ఎంపీటీసీ సభ్యులకు మాత్రమే ఎన్నుకునే హక్కు ఉంటుందన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మండల కో-ఆప్షన్ సభ్యులకు ఓటింగ్ ఉండదన్నారు. మెజారిటీ సభ్యులు చేతులెత్తి మద్దతు తెలిపిన వారే ఎంపీపీ, వైస్ ఎంపీపీగా ఎన్నికవుతారన్నారు. ఎన్నికల రోజున బందోబస్తు కూడా ఉంటుందని, 144 సెక్షన్ అమలులో ఉంటుందనే విషయాన్ని ముందుగా చాటింపు వేయించాలని ఆదేశించారు. ప్రిసైడింగ్ అధికారులు ఖుష్బూ కొఠారి(ఉరవకొండ), జి.భార్గవ్(కణేకల్లు), మద్దిలేటి(కంబదూరు), రఘునాథరెడ్డి(యల్లనూరు), ప్రభాకర్‌రెడ్డి(పెద్దపప్పూరు), శ్రీనివాసయాదవ్ (రాయదుర్గం), సుదర్శన్(గాండ్లపెంట),విజయ ప్రసాద్ (రొద్దం), సంజీవయ్య(రామగిరి), ఎన్నికల విభాగం అధికారులు ధనుంజయ, ఖలందర్ పాల్గొన్నారు.

పంటల్ని చూస్తే గుండె తరుక్కుపోతోంది

- చంద్రబాబు సర్కారు తీరుతో అన్నదాతల జీవితాలు అతలాకుతలం
- వైఎస్సార్ సీపీ నేతలు శైలజానాథ్, కేతిరెడ్డి పెద్దారెడ్డి
- యల్లనూరు, పుట్లూరు మండలాల్లో దెబ్బతిన్న పంటల పరిశీలన



యల్లనూరు మండలం కూచివారిపల్లిలో దెబ్బతిన్న అరటి తోటను పరిశీలిస్తున్న మాజీ మంత్రి శైలజానాథ్, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

యల్లనూరు/పుట్లూరు: 'ప్రకృతి వైపరీత్యాలతో వందల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. అన్నదాతల జీవితాలు అతలాకుతలమయ్యాయి. బాధిత రైతులను చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం కళ్లు మూసుకొని ఉంది' అంటూ మాజీ మంత్రి శైలజానాథ్, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మండిపడ్డారు. మంగళవారం వారు యల్లనూరు, పుట్లూరు మండలాల్లో పర్యటించారు. కూచివారిపల్లి,బుక్కాపురం,తిమ్మంపల్లి,చింతకాయమంద, గొడ్డుమర్రి, దంతలపల్లి, నీర్జాంపల్లి, ఎల్లుట్ల, జంగంరెడ్డిపేట, మడ్డిపల్లి, కుమ్మనమల గ్రామాల్లో ఇటీవల ఈదురుగాలులకు దెబ్బతిన్న అరటి, బొప్పాయి పండ్ల తోటలు, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ రైతులు ఆర్తనాదాలు పెడుతున్నా కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. గత ప్రభుత్వంలో అమలు చేసిన ఉచిత పంటల బీమాను తొలగించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నట్లు తెలిపారు. రూ. లక్షలు పెట్టుబడి పెట్టిన అరటి పంటలు దెబ్బతింటే ఎకరాకు కేవలం రూ.14 వేలు ఇస్తామని చెప్పడం విడ్డూరమన్నారు. అది కూడా తోట మొత్తం దెబ్బతిని ఉంటేనే పరిహారం ఇస్తామనడం అన్యాయమని, ఎకరాకు 1,300 అరటి చెట్లు సాగు చేస్తే గాలులకు 1,000 చెట్ల దాకా నేలకొరిగాయని, ఇంకా 300 చెట్లున్నాయంటూ పరిహారం ఇవ్వరా అని ప్రశ్నించారు. అధికారుల నిర్లక్ష్యంతోనే నీర్జాంపల్లికి చెందిన రైతులు ఆత్మహత్యాయత్నం చేశారన్నారు. త్వరలో తమ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి రైతులను ఆదుకోవాలని కోరనున్నట్లు తెలిపారు. విజయవాడ కమిషనరేట్‌లో డిల్లీరావుతో ప్రత్యేకంగా సమావేశమై న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వంశీ గోకుల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, పార్టీ మండల కన్వీనరు వెంకటేష్‌నాయుడు, సర్పంచులు నారాయణస్వామి, ప్రభాకర్‌రెడ్డి, జమాల్, పెద్దనాగరాజు, నాయకులు మహేశ్వరరెడ్డి, నాగేశ్వరరెడ్డి, శింగనమల ప్రసాద్, సూర్యనారాయణరెడ్డి, శేఖర్, ఈశ్వరరెడ్డి, విష్ణు నారాయణ, సుబ్బయ్య, సూరీ, పురుషోత్తంనాయుడు, కిరణ్, శంకర్‌రెడ్డి, రవి, జనార్దన్, బాలవెంకటరెడ్డి, రాజకుళ్లాయిరెడ్డి, రమణ, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాటలొద్దు.. చేతలు కావాలి బాబూ



రైతులను పరామర్శిస్తున్న శైలజానాథ్

అనంతపురం కార్పొరేషన్: మాటలు చెప్పకుండా ఎకరాకు రూ.లక్ష ప్రకారం రైతులకు ఇచ్చి సీఎం చంద్రబాబు చేతల్లో చూపాలని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ పేర్కొన్నారు. అనంతపురం సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న నీర్జాంపల్లికి చెందిన రైతులు లక్ష్మీనారాయణ, చిన్న వెంగప్పలను ఆయన పరామర్శించారు. అధైర్య పడరాదని బాధిత కుటుంబ సభ్యుల్లో ధైర్యం నింపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అడుగడుగునా రైతులకు చేయూతనందించారన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, రైతు భరోసాతో ఆదుకున్నారన్నారు. చంద్రబాబు ఇప్పటికైనా కళ్లు తెరవకుంటే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

ఈ గ్రామాల్లో బోరుబావులు నిషేధం

అనంతపురం అగ్రికల్చర్: ఆంధ్రప్రదేశ్ నీరు, భూమి, వృక్షముల చట్టం-వాల్టా (ఏపీ వాటర్, ల్యాండ్ అండ్ ట్రీ యాక్ట్-2002) ప్రకారం ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 64 గ్రామ పంచాయతీల్లో కొత్తగా బోరుబావుల తవ్వకాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా గ్రామాల్లో అత్యధిక నీటి వినియోగం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అత్యవసరమైతే ఉన్నతాధికారుల అనుమతితోనే తాగునీటి అవసరాల కోసం బోరుబావుల తవ్వకం చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

నిషేధిత జాబితాలోని గ్రామాలిలా...

- పుట్లూరు మండలం కోమటికుంట్ల, మడుగుపల్లి, తాడిపత్రి మండలం బోడాయిపల్లి, బొందలదిన్నె, హుస్సేనాపురం, సజ్జలదిన్నె, తాడిపత్రి రూరల్ పంచాయతీ, యల్లనూరు మండలం అరవేడు, బొప్పేపల్లి, మేడికుర్తి, పెద్దమల్లేపల్లి, తిరుమలాపురం, వేములపల్లె గ్రామ పంచాయతీ.
- శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో అత్యధికంగా 51 గ్రామాలను 'వాల్టా' పరిధిలోకి తీసుకొచ్చారు. అందులో అగళి మండలం హుళ్లికెర దేవరహళ్లి, ఇనగలూరు, మధూడి, నరసంబూడి, పి.బ్యాడిగేరె, రావుడి, అమడగూరు మండలం కరిణిరెడ్డిపల్లి, లోకోజిపల్లి, అమరాపురం మండలం తమ్మిడేహళ్లి, చిలమత్తూరు మండలం దేమకేతేపల్లి, హుస్సేనాపురం, గాండ్లపెంట మండలం చామచాయన బైలు, చామలగొంది, గాండ్లపెంట, జీనుగుల కుంట, కురుమామిడి, మడుగువానిగొంది, సోమయాజులపల్లి, గుడిబండ మండలం జి.మోరుబాగల్, కేకాతి, ఎస్.రాయాపురం హిందూపురం మండలం దేవరపల్లె, గోళ్లాపురం, కిరికెర, కొటిపి, కొట్నూరు, మలుగూరు, మణేసముద్రం, శ్రీకంఠాపురం రూరల్, లేపాక్షి మండలం చోళసముద్రం, ఎన్‌పీ కుంట మండలం ఎదురుదొన, గూటిబయలు, గౌకనపల్లి, ముదుపలజూవి, రొద్దం మండలం చెరకూరు, రొళ్ల మండలం బొమ్మగుండనహళ్లి, దొడ్డేరి, కాకి, ఎం.రాయాపురం, రొళ్ల, తాడిమర్రి మండలం దాడితోట, తలుపుల మండలం పులిగుండ్లపల్లె, తనకల్లు మండలం అగ్రహారంపల్లె, బాలసముద్రం, బొంతలపల్లె, చీకటిమానిపల్లి,దిగువమండలపల్లి, గుర్రంబయలు, కోటపల్లె, మద్దినాయనిపాలెం, టి.సదుంలు ఉన్నాయి.



రాష్ట్రంలో 300 పంచాయతీలు

- రాష్ట్ర వ్యాప్తంగా 8 జిల్లాల పరిధిలో 300 గ్రామ పంచాయతీలను 'వాల్టా' పరిధిలోకి తీసుకొచ్చారు. అందులో అత్యధికంగా ప్రకాశం జిల్లాలో 94 గ్రామాలు ఉన్నాయి. ఆ తర్వాత శ్రీకాకుళం- 76, శ్రీ సత్యసాయి-51, వైఎస్సార్ కడప- 32, చిత్తూరు- 18, పల్నాడు- 16, అనంతపురం -13, అన్నమయ్య జిల్లాలో ఒక గ్రామం... ఇలా మొత్తం 300 గ్రామాల్లో 'వాల్టా' అమలు చేయాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు భూగర్భజలశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.తిప్పేస్వామి తెలిపారు.

తాడిపత్రిలో అర్ధరాత్రి పోలీసుల అత్యుత్సాహం

- గుట్టుచప్పుడు కాకుండా ఫయాజ్ బాషాను అనంతపురం తరలింపు
- ఖాకీల తీరుపై పట్టణవాసుల మండిపాటు



తాడిపత్రిటౌన్: తాడిపత్రిలో అర్ధరాత్రి వేళ పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. గుట్టుచప్పుడు కాకుండా వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు ఫయాజ్‌బాషాను అనంతపురం తరలించారు. ఇటీవల ఫయాజ్‌బాషా తన నూతన గృహంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇవ్వడాన్ని జీర్ణించుకోలేని జేసీ ప్రభాకర్‌రెడ్డి పోలీసులను ఉసిగొల్పారు. ఇదే అదునుగా ఫయాజ్ ఇంటిపై టీడీపీ అల్లరి మూకలు రాళ్ల దాడి చేశాయి. అయినా, దాదాపు 17 మంది వైఎస్సార్‌సీపీ నాయకులపైనే పోలీసులు కేసులు నమోదు చేసి స్వామి భక్తిని ప్రదర్శించారు. తాజాగా ఆయన్ను పండుగ పూట కూడా ఇంట్లో ఉండకుండా చేయడం గమనార్హం. దాదాపు 60 మంది పోలీసులు సోమవారం అర్ధరాత్రి ఫయాజ్ బాషా ఇంటిని చుట్టుముట్టి తమ జీపులోనే అనంతపురం తరలించారు. 10 రోజుల పాటు తాడిపత్రికి రావొద్దంటూ హుకుం జారీ చేశారు.రంజాన్ వేళ పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తారన్న నెపంతో తరలించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని 9 నెలలుగా తాడిపత్రికి రాకుండా చేసిన పోలీసులు..ఇప్పుడు ఆ పార్టీ ముఖ్య నాయకుడు ఫయాజ్‌బాషాను పట్టణం నుంచి తరలించి జేసీ ఆగడాలకు రూట్‌క్లియర్ చేస్తున్నారంటూ పట్టణవాసులు మండిపడుతున్నారు.

ఎస్‌బీఐ ఏటీఎం సెంటరులో అగ్ని ప్రమాదం

- ఏసీ సిలిండర్లు, బ్యాటరీలు పేలడంతో ఘటన
- పూర్తిగా దగ్ధమైన ఏటీఎం సెంటరు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని బళ్లారి రోడ్డు సోమా పాండు కాంప్లెక్స్‌లోని ఎస్‌బీఐ ఏటీఎం సెంటరులో జరిగిన అగ్ని ప్రమాదంతో భారీగా ఆస్తినష్టం వాటిల్లింది. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగింది. ఘటన సమయంలో ఏటీఎం సెంటరు సెక్యూరిటీ గార్డు శ్రీనివాసులు పెద్ద శబ్దం విని లోపల వెళ్లేందుకు ప్రయత్నించాడు. క్షణంలోనే మరో భారీ శబ్దంతో ఏసీ పేలి మంటలు శరవేగంగా వ్యాపించాయి. విషయాన్ని వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు, అక్కడే పై అంతస్తులో నివాసం ఉంటున్న భవన యజమానికి చేరవేశాడు. హుటాహుటిన చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది గంట పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. అప్పటికే ఏటీఎం సెంటర్ పూర్తిగా కాలిపోయింది. అదే కాంప్లెక్స్‌లో పార్కింగ్‌లో ఉంచిన నాలుగు ద్విచక్ర వాహనాలతో పాటు ఒక సైకిల్ దగ్ధమయ్యాయి. ఏటీఎం సెంటరుకు ఆనుకుని ఉన్న రూముల్లో మంటల వ్యాప్తితో నష్టం వాటిల్లింది. సుమ ఎంటర్‌ప్రైజెస్‌లో ఎలక్ట్రిక్ వస్తువులు దెబ్బతిన్నట్లు యజమానులు గోపి, విజయ్ తెలిపారు. దుస్తుల షాపులో రెడీమేడ్ దుస్తులు కాలిపోయినట్లు బాధితుడు పవన్‌కుమార్ వాపోయాడు. ఏటీఎం వెనుక భాగంలోని ఫొటో స్టూడియోలోనూ నష్టం వాటిల్లినట్లు బాధితుడు శ్రీనివాసులు తెలిపాడు. కాగా.. ఏటీఎంలో డబ్బులు కాలిపోయాయా, లేదా అనే విషయం తెలియరాలేదు. ఈ విషయమై ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ మృత్యుంజయతో ఆరా తీయగా.. ఏటీఎం లాక్ తెరిచి పరిశీలించాల్సి ఉందని, నిపుణులకు సమాచారం అందజేశామని చెప్పారు. మొత్తమ్మీద ఈ ఘటనలో రూ.20 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. నష్టంపై యజమానులతో వివరాలు సేకరిస్తున్నట్లు లీడింగ్ ఫైర్‌మెన్ మల్లారెడ్డి తెలిపారు.



మంటల్లో పూర్తిగా కాలిపోయిన ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్

క్లుప్తంగా

సీఎం కాన్ఫరెన్స్‌లో కలెక్టర్


సీఎం కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

అనంతపురం అర్బన్: విజయవాడలోని సచివాలయంలో బుధవారం సీఎం చంద్రబాబు నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్లతో రెండు రోజుల పాటు ఈ సమావేశాలు జరగనున్నాయి. జిల్లా అభివృద్ధికి చేపట్టాల్సిన పలు అంశాలను ఈ సందర్భంగా సీఎంకు కలెక్టర్ వివరించనున్నట్లు సమాచారం.

రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు తప్పనిసరి


ఏపీఎఫ్‌ఆర్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

గార్లదిన్నె: రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య (ఏపీఎఫ్‌ఆర్) నమోదు తప్పనిసరి అని రైతులకు జేడీఏ ఉమామహేశ్వరమ్మ సూచించారు. గార్లదిన్నె మండలం యర్రగుంట్ల, మర్తాడు, గార్లదిన్నె రైతు సేవా కేంద్రాల్లో చేపట్టిన ఏపీఎఫ్‌ఆర్ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ఆమె పరిశీలించి, మాట్లాడారు. మండల వ్యాప్తంగా 11 వేల మంది రైతులు ఇప్పటి వరకూ ఏపీఎఫ్‌ఆర్ నమోదు చేసుకున్నారన్నారు. ఈ విశిష్ట సంఖ్య ఉంటేనే ప్రభుత్వ పథకాలకు అర్హత ఉంటుందన్నారు. ఏపీఎఫ్‌ఆర్ నమోదు చేసుకోని రైతులు ఆయా గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సోమశేఖర్, రైతులు పాల్గొన్నారు.

డీఎస్సీ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం రూరల్: ఆన్‌లైన్ ద్వారా అందించే డీఎస్సీ ఉచిత శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ ఉప సంచాలకులు సుమన జయంతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. టెట్‌లో అర్హత సాధించిన జిల్లాకు చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి. టెట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. పూర్తి వివరాలకు 08554 275575లో సంప్రదించవచ్చు.

బార్ కాదిది.. బస్టాండే!


ప్రయాణికులు కాలు పెట్టేందుకు కూడా వీలు లేకుండా ఆక్రమించి ఏర్పాటు చేసిన తోపుడు బండ్లు

అధికారుల ఉదాసీనత కారణంగా బుక్కరాయసముద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులకు అందుబాటులో లేకుండా పోయింది. బస్టాండ్ ముందు భాగాన్ని పూర్తిగా ఆక్రమించుకున్న కొందరు వివిధ రకాల వ్యాపారాలను ఏర్పాటు చేశారు. వీటి మాటున రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయి. బస్టాండ్‌లోనే మందుబాబులు తిష్టవేసి మద్యం సేవించిన అనంతరం ఖాళీ బాటిళ్లను అక్కడే వదిలేసి వెళుతున్నారు. మరికొందరు వాహనదారులు తమ ద్విచక్ర వాహనాలను బస్టాండ్‌లోపల ఉంచి వెళుతున్నారు. ఇవన్నీ ఓ ఎత్తయితే... మరోవైపు ప్రచార ఆర్భాటంతో స్థానిక టీడీపీ నేత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో కుండలు లేక బోసిపోయింది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు మేల్కొంటారో లేదో చూడాలి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం


బస్టాండ్‌లో మద్యం సేవించి పడేసిన ఖాళీ బాటిళ్లు


బస్టాండ్‌లో నిలిపిన ద్విచక్ర వాహనాలు

రక్తదానంతో మరొకరికి పునర్జన్మ

- ఎస్‌ఆర్‌ఐటీ కళాశాల చైర్‌పర్సన్ జొన్నలగడ్డ పద్మావతి, కరస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి



రక్తదానం చేస్తున్న ఆలూరి సాంబశివారెడ్డి, దుస్తులు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

బుక్కరాయసముద్రం: రక్తదానం చేస్తే ఆపదలో ఉన్నవారికి పునర్జన్మను ఇచ్చినట్లు అవుతుందని ఎస్‌ఆర్‌ఐటీ కళాశాల చైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, కరెస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి అన్నారు. ఆలూరి సాంబశివారెడ్డి తల్లి ఆలూరి నారాయణమ్మ 18వ వర్ధంతి సందర్భంగా మంగళవారం బీకేఎస్ మండలం రోటరీపురం వద్ద ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో అనంతపురం జీజీహెచ్, మానవతా స్వచ్ఛంద సంస్థ నేతృత్వంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అంతకు ముందు ఆలూరి నారాయణమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిబ్బందికి నూతన దుస్తులను జొన్నలగడ్డ పద్మావతి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రక్తదానం చేయడాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. అనంతరం కళాశాలలో సేకరించిన 102 యూనిట్ల రక్తాన్ని ప్రభుత్వ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, టీపీఓ రంజిత్‌రెడ్డి, మానవతా బ్లడ్ బ్యాంక్ కన్వీనర్ తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రి టౌన్ (యాడికి): మండల కేంద్రం యాడికి గ్రామానికి చెందిన బలరాముడు (32) ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యానికి బానిసగా మారి కుటుంబాన్ని నిర్లక్ష్యం చేయడంతో భార్య సుమాంజలి తరచూ నిలదీస్తూ వచ్చేది. ఈ నేపథ్యంలో మంగళవారం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ వద్ద నిర్జన ప్రదేశంలో క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ప్రజావ్యతిరేక పాలనపై పోరాటం

- ఉపాధి చట్టాన్ని కాపాడుకుంటాం
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్


మాట్లాడుతున్న ఆవుల శేఖర్

అనంతపురం అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగిస్తున్న ప్రజావ్యతిరేక పాలనపై పోరాటాలు సాగిస్తామని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాసం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేలా ప్రభుత్వాలు సాగిస్తున్న కుట్రను అడ్డుకుని పథకాన్ని కాపాడుకుంటామన్నారు. అనంతపురంలోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో రాయలసీమ జిల్లాల వ్యకాసం అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం మంగళవారం జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఆవుల శేఖర్‌తో పాటు సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ కూటమి ప్రభుత్వం ప్రజల్లో మతతత్వాన్ని పెంచిపోషిస్తోందన్నారు. ఇలాంటి తరుణంలో రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. బడ్జెట్‌లో రూ.4.60 లక్షల కోట్లు కేటాయించాల్సి ఉంటే రూ.86 వేల కోట్లు మాత్రమే కేటాయించడమే ఇందుకు నిదర్శనమన్నారు. వ్యవసాయ, కార్మిక, యువజన, విద్యార్థి, మహిళల హక్కులను నిర్వీర్యం చేయడంతోపాటు పేదలు పోరాడి సాధించుకున్న చట్టాలను మోదీ ప్రభుత్వం కాలరాస్తోందని మండిపడ్డారు.

పథకాలు ఎగ్గొట్టేందుకు సీఎం పథకం

ముఖ్యమంత్రి చంద్రబాబు పీ4 విధానమంటూ సంక్షేమ పథకాలను ఎగొట్టేందుకు పథకం వేశారని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా దాటవేస్తున్నారన్నారు. భూ సమస్యలు, ఉపాధి హామీ, ఇళ్ల స్థలాల సమస్యల సాధనకు పోరాటాలు తప్ప మరో మార్గం లేదని, ఇందుకు అందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వ్యకాసం రాష్ట్ర కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు తోపు కిష్టప్ప, రాయలసీమ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు రంగయ్య, పెద్దయ్య, నబీరసూల్, భూపేష్, రాధాకృష్ణ, పందుగోలమని, కదిరప్ప, బాలస్వామి, చెన్నరాయుడు, దేవేంద్ర, వెంకట్రామిరెడ్డి, సుందరం, సత్యనారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

‘పరిటాల’ అండతోనే భూ వివాదం

- అంతమాత్రాన కొత్తపల్లి మోహన్‌రెడ్డిపై దాడి చేయడం సబబు కాదు
- పది మందికి సాయం చేసే మనసు ప్రకాష్‌రెడ్డిది
- ఎమ్మెల్యే పరిటాల సునీతపై మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఫైర్


మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ‘పరిటాల కుటుంబం అండతోనే ఆత్మకూరు మండలం వడ్డుపల్లిలో 26 సెంట్ల భూ వివాదంలోకి కొత్తపల్లి మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి జోక్యం చేసుకుని రూ. 60 లక్షలు డిమాండ్ చేశాడు. అంతమాత్రాన అతనిపై దాడి చేయడం కరెక్ట్ కాదు. తనది కాని భూమికి ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించుకుని అందులోకి వెళ్లడం ఆయనదీ కరెక్ట్ కాదు’ అని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రోజుల క్రితం కొత్తపల్లి మోహన్‌రెడ్డిపై జరిగిన దాడి కేసులో అరెస్టైన చింతపంటి సుధాకరరెడ్డి, దివాకర్‌రెడ్డి పోలీసు విచారణలో భూ వివాదమే ఇందుకు కారణంగా స్పష్టం చేశారన్నారు. గతంలో చింతపంటి సుధాకర్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి ఆత్మకూరు మండలం వడ్డుపల్లిలో 26 సెంట్ల భూమిని కొనుగోలు చేశారన్నారు. శాశ్వత విక్రయఖరారు నామా రాయించుకున్నారని గుర్తు చేశారు. ఇదే భూమిని ఇటీవల మరో వ్యక్తికి అప్పట్లో శాశ్వత విక్రయఖరారు నామా చేసిన వారి వారసులు రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. ఇది పూర్తిగా చట్ట విరుద్ధమని, చట్టరీత్యా అది చెల్లుబాటు కూడా కాదన్నారు. ఈ డాక్యుమెంట్ ఆధారంగా భూ వివాదంలోకి కొత్తపల్లి మోహన్‌రెడ్డి ప్రవేశించాడన్నారు. ఇందుకు సంబంధించి ఘటన జరిగిన మరుసటి రోజు వేకువజామునే నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారన్నారు. అయితే వాస్తవాలు గుర్తించకుండా మోహన్‌రెడ్డిపై దాడి వెనుక ఎవరున్నా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతున్నారని, తాను ఫోన్ చేసే వరకూ ఎస్పీ, డీఎస్పీ పట్టించుకోలేదని ఆరోపణలు చేస్తుండడం ఆమె అవివేకానికి నిదర్శనమన్నారు. కేవలం పరిటాల సునీత అండ చూసుకునే మోహన్‌రెడ్డి ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడన్నారు.

వంద మంది రెడ్లను చంపిన చరిత్ర

కమ్మోల్లు, కాపోల్లు కలసిమెలసి ఉంటూ మామా.. చిన్నాన్న అంటూ సంబంధాలను కలుపుకుని పోయే మనస్తత్వం కొత్తపల్లి గ్రామ ప్రజలదని ప్రకాష్‌రెడ్డి అన్నారు. అలాంటి గ్రామంలో రెడ్లను రెండు గుంపులుగా చేసి తన స్వార్థానికి వారి మధ్య వర్గ కక్షలకు సునీత ఆజ్యం పోస్తున్నారని మండిపడ్డారు. సునీత భర్త పరిటాల రవీంద్ర నియోజకవర్గంలోని వంద మంది రెడ్లను చంపిస్తే.. అదే నియోజకవర్గంలో రెడ్ల మధ్య ప్రస్తుతం ఫ్యాక్షన్ చిచ్చును సునీత రాజేస్తోందని ధ్వజమెత్తారు. రాప్తాడులో ప్రసాదరెడ్డి హత్య వెనుక సూత్రధారి సునీతనేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. సునీతకు, ఆమె కుటుంబానికి కబ్జాల చరిత్ర ఉందని, పదిమందికి సాయం చేసే మనస్తత్వం ప్రకాష్‌రెడ్డిదని గుర్తించాలన్నారు. ఇప్పటి వరకూ కేవలం మహిళ అని గౌరవించి మాట్లాడుతున్నానన్నారు. ఆమె మాదిరిగా వ్యక్తిగత దూషణలకు తాను పోలేదని, అలా మొదలుపెడితే ఆమె కంటే బాగా తిట్టగలనన్నారు. సమావేశంలో రాప్తాడు వైస్ ఎంపీపీ రామాంజనేయులు, యూత్ మాజీ కన్వీనర్ చిట్రెడ్డి సత్యానారాయణరెడ్డి, కొత్తపల్లి గ్రామస్తులు బాలకృష్ణారెడ్డి, రఘునాథరెడ్డి, వెకంటరామిరెడ్డి, తాతిరెడ్డి పాల్గొన్నారు.

15 మంది దాడి చేశారు

- పోలీసులకు ఫిర్యాదు చేసిన కోనా మురళీ సతీమణి శ్రీలత

గుత్తి: టీడీపీ అల్లరి మూకలు మొత్తం 15 మంది తమ ఇంటిపై దాడి చేశారని మాజీ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ నాయకుడు కోనా మురళీధర్‌రెడ్డి సతీమణి కోనా శ్రీలత మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం రాత్రి తాను ఒంటరిగా ఇంట్లో ఉన్న సమయంలో టీడీపీ అల్లరి మూకలు రెచ్చిపోయి తమ ఇంటిపై రాళ్లతో విరుచుకుపడ్డారన్నారు. తనకు స్వల్పగాయాలయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. టీడీపీ నాయకులు ప్రతాప్, ఓం ప్రకాష్, రమేష్, గోవర్ధన్‌తో పాటు మరో 11 మంది దాడుల్లో పాల్గొన్నారని, ఇంటితో పాటు కారునూ ధ్వంసం చేశారని ఫిర్యాదు చేశారు. విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు.

వ్యక్తి దుర్మరణం


ఎం.రఘు (ఫైల్)

కూడేరు: మండలంలోని జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండ మండలం రాకెట్ల గ్రామానికి చెందిన మదమంచి రఘు (35)కు భార్య భారతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న కుమార్తెను వదిలేందుకు మంగళవారం అనంతపురానికి వెళ్లాడు. అనంతరం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన ఆయన కూడేరు మండలం బ్రాహ్మణపల్లి వద్దకు చేరుకోగానే గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనంతో పాటు ఉడాయించాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

నిర్లక్ష్యానికి తావివ్వొద్దు : జేసీ


వీసీలో మాట్లాడుతున్న జేసీ శివ్‌నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: ప్రజల సమస్యలను పరిష్కరించే క్రమంలో ఏ స్థాయిలోనూ నిర్లక్ష్యానికి తావివ్వకూడదని అధికారులను జాయింట్ కలెక్టర్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశించారు. రెవెన్యూకు సంబంధించిన అంశాలపై మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ఆర్‌డీఓలు, తహసీల్దార్లు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రాజెక్టులకు భూసేకరణ, భూ అప్పగింత, రీసర్వే, రెవెన్యూ సేవలు, పీజీఆర్ఎస్, తదితర అంశాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రీ–సర్వే ప్రక్రియ వేగవంతం చేసి సకాలంలో పూర్తిచేయాలన్నారు. భూ సమస్యలు లేకుండా ఎల్‌పీఎంలు ఇవ్వాలన్నారు. జాతీయ రహదారి ‘544డి’కి సంబంధించి భూసేకరణ, భూమి అప్పగింత ప్రక్రియపై ఆరా తీశారు. రైల్వే ప్రాజెక్టులకు భూసేకరణ విషయంలో తలెత్తిన సమస్యలను పరిష్కరించాలన్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా బైండోవర్ కేసుల్లో జరిమానా అధికంగా వేసి నాటుసారా తయారీకి అడ్డుకట్ట వేయాలన్నారు. సమీక్షలో కలెక్టరేట్ భూ విభాగం సూపరింటెండెట్ రియాజుద్దీన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ రమణమూర్తి

అనంతపురం: అంతర్‌జిల్లా దొంగల ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.16 లక్షల విలువైన 18 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అదనపు ఎస్పీ డీవీ రమణమూర్తి వెల్లడించారు. అనంతపురంలోని భవానీనగర్‌లో నివాసముంటున్న వనరస జితేంద్ర అలియాస్ సిద్దు, షేక్ తౌహిద్ అలియాస్ సోనూ, ఇందిరానగర్‌కు చెందిన మైనర్ బాలుడు, శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం ముత్యాల చెరువు గ్రామానికి చెందిన నల్లనాచప్పగారి గణేష్, ముత్యాలచెరువు గ్రామానికి చెందిన నూర్ మహమ్మద్ వ్యసనాలకు బానిసలుగా మారి, తమ జల్సాలు తీర్చుకునేందుకు మూడు బృందాలుగా ఏర్పడి అనంతపురం, వైఎస్సార్ జిల్లాల్లో ద్విచక్ర వాహనాలను అపహరించేవారు. వీరిలో జితేంద్రపై అనంతపురం రెండు, మూడు, రూరల్, గుత్తి పీఎస్ పరిధిలో మొత్తం 8 కేసులున్నాయి. ఇది వరకే సాగించిన దొంగతనాలకు సంబంధించి 2 కేసులున్నాయి. కార్పెంటర్‌గా పనిచేస్తున్న తౌహిద్, తన స్నేహితుడు (మైనర్)తో కలసి ముఠాగా ఏర్పడి ద్విచక్రవాహనాలను అపహరించేవాడు. వీరిపై అనంతపురం వన్‌టౌన్, ధర్మవరం టూటౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిల్లో చెరో 6 కేసులున్నాయి. మైనర్‌పై రెండు బైక్ చోరీ కేసులున్నాయి. బేల్దారి నల్లనాచప్పగారి గణేష్, బైక్ మెకానిక్ నూర్ మహమ్మద్ ఇద్దరూ ఒకే ప్రాంతానికి చెందిన వారు కావడంతో మంచి స్నేహితులయ్యారు. జల్సాలకు అవసరమైన డబ్బు కోసం ద్విచక్ర వాహనాలను అపహరించేవారు. వీరిపై మొత్తం ఆరు కేసులుండగా ఇందులో వైఎస్సార్ జిల్లాలో ఐదు, అనంతపురం జిల్లాలో ఒకటి ఉన్నాయి. నిందితులు మంగళవారం అనంతపురంలోని ఎస్‌జేఆర్ ఫంక్షన్ హాలు వద్ద తచ్చాడుతుండగా అనంతపురం వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్, త్రీ టౌన్ సీఐ శాంతిలాల్, సీసీఎస్ సీఐలు ఇస్మాయిల్, జైపాల్‌రెడ్డి గుర్తించి అరెస్ట్ చేశారు. మైనర్‌ను సీడబ్ల్యూసీ ఎదుట హాజరుపరిచారు. మిగిలిన వారిని న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

అనంత శివారున చైన్ స్నాచింగ్

రాప్తాడు రూరల్: జిల్లా కేంద్రం శివారులో దుండగులు చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం రూరల్ మండలం కాట్నేకాలువ గ్రామానికి చెందిన దేవి తన కుమారుడు తనూజ్‌రెడ్డితో కలసి పంపనూరులోని సుబ్రహ్మణ్యస్వామి దర్శనం కోసం ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మరో ద్విచక్ర వాహనంపై అనుసరిస్తూ వెళ్లిన యువకులు కామారుపల్లి దాటిన తర్వాత వెనుక నుంచి దేవి మెడలోని బంగారు చైన్ లాక్కొని ఆత్మకూరు వైపుగా దూసుకెళ్లారు. తల్లి, కుమారుడు కేకలు వేసినా ఫలితం లేకపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వృద్ధురాలి అనుమానాస్పద మృతి

తాడిపత్రి టౌన్ (యాడికి): మండల కేంద్రం యాడికిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో నివాసముంటున్న లక్ష్మీదేవి(80) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. మతిస్థిమితం సరిగా లేని ఆమె ఈ నెల 18న ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆమె ఆచూకీ లేకపోవడంతో కుమారుడు మల్లికార్జున ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం యాడికిలోని ఉన్నత పాఠశాల సమీపంలో నిర్జీవంగా పడి ఉన్న వృద్ధురాలిని గుర్తించిన స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతురాలిని లక్ష్మీదేవిగా కుమారుడు నిర్ధారిస్తూ ఆమె మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆస్తి కోసం కుమారుడి కర్కశం

- కన్న తండ్రిపై వేట కొడవలితో దాడి
- అక్కడికక్కడే మృతి చెందిన సుంకప్ప


హతుడు సుంకప్ప

రాయదుర్గం: ఆస్తి కోసం ఓ కుమారుడు బరితెగించాడు. వేటకొడవలితో కన్న తండ్రిపై దాడి చేసి హతమార్చాడు. పోలీసులు తెలిపిన మేరకు... రాయదుర్గం మండలం టి.వీరాపురం గ్రామానికి చెందిన వాల్మీకి సుంకప్ప (68), గంగమ్మ దంపతులకు నలుగురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. దేవుడి మహిమతో పుట్టాడని కుమారుడికి వన్నూర్‌స్వామిగా పేరుపెట్టారు. అమ్మాయిలకు పెళ్లిళ్లు చేసి అత్తారింటికి పంపారు. పూర్వీకులు సంపాదించిన 2 ఎకరాల ఆస్తి సుంకప్ప పేరుపైనే ఉంది. దీంతో ఆస్తిని తన పేరున బదలాయించాలంటూ కొంత కాలంగా తండ్రిని కుమారుడు వేధిస్తూ వచ్చాడు. అయితే ఇందుకు తండ్రి అంగీకరించకపోవడంతో భార్యతో కలసి వేరు కాపురం పెట్టాడు. మంగళవారం తన తండ్రి ఇంటికి చేరుకున్న వన్నూర్‌స్వామి ఆస్తి కోసం గొడవ పడ్డాడు. ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. విచక్షణ కోల్పోయిన వన్నూర్‌స్వామి అప్పటికే తన వద్ద సిద్ధంగా ఉంచుకున్న వేటకొడవలి తీసి తండ్రిపై దాడి చేశాడు. ఘటనలో సుంకప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని తన తండ్రిని హత్య చేసినట్లుగా వన్నూర్ స్వామి అంగీకరిస్తూ లొంగిపోయాడు. ఘటనా స్థలాన్ని సీఐ జయానాయక్ పరిశీలించి కేసు నమోదు చేశారు.

‘మార్కెటింగ్’ టార్గెట్ రూ.19.79 కోట్లు

అనంతపురం అగ్రికల్చర్: ఏప్రిల్ నుంచి ప్రారంభం కానున్న 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను ఉమ్మడి అనంతపురం జిల్లా మార్కెట్ కమిటీలకు రూ.19.79 కోట్ల పన్ను వసూళ్లను లక్ష్యంగా మార్కెటింగ్‌శాఖ నిర్ధేశించింది. మంగళవారం అనంతపురంలోని మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) సి.రామాంజినేయులు సమక్షంలో రెండు జిల్లాల ఏడీఎంలు పి.సత్యనారాయణచౌదరి, ఎల్ఎన్ మూర్తి, 17 మార్కెట్ కమిటీల సెక్రటరీలు, సూపర్‌వైజర్లు సమావేశమయ్యారు. 2024–25లో నిర్దేశించిన టార్గెట్లు, సాధించిన ప్రగతిపై సమీక్షిస్తూనే వచ్చే ఆర్థిక సంవత్సరంలో పన్ను వసూళ్లు, బడ్జెట్ తదితర అంశాలపై మార్కెట్ కమిటీల వారీగా చర్చించారు. అనంతపురం జిల్లా పరిధిలో ఉన్న 9 మార్కెట్ కమిటీకు రూ.13.93 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో ఉన్న 8 మార్కెట్ కమిటీలకు రూ.5.86 కోట్లు టార్గెట్ నిర్దేశించారు. ప్రస్తుత 2024–25లో రూ.5.31 కోట్లకు గానూ వంద శాతం సాధించే దిశగా మార్కెట్ కమిటీలు పయనిస్తున్నట్లు తెలిపారు. దీంతో రెండు జిల్లాలకు అదనపు టార్గెట్లను కలిసి రూ.19.79 కోట్లు నిర్ధేశిస్తున్నట్లు ఆర్జేడీ తెలిపారు. ఎక్కడా లీకేజీలు లేకుండా వంద శాతం ఫీజు వసూళ్లపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ ఏడాది ఇప్పటికే వంద శాతం పూర్తయిన మార్కెట్ కమిటీ సెక్రటరీలను అభినందిస్తూనే మిగిలిన ఈ వారంలో మిగతా మార్కెట్ కమిటీలు కూడా వంద శాతాన్ని అధిగమించాలని ఆదేశించారు.

క్లుప్తంగా

పోలీసు శిక్షణ కళాశాలకు పరికరాల వితరణ



పోలీసు శిక్షణా కళాశాలకు పరికరాలను అందిస్తున్న హుమిన్ హో

అనంతపురం : అనంతపురం పోలీసు శిక్షణా కళాశాలకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద హుందాయ్ మొబిస్ ఇండియా మాడ్యుల్ ప్రైవేట్ లిమిటెడ్ మూడు సోలార్ హీటర్లు, మూడు వాటర్ డిస్పెన్సర్స్, ఒక రోటి తయారీయంత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హుందాయ్ మొబిస్ హెచ్ఆర్‌జీఏ కోఆర్డినేటర్ హుమిన్ హో మాట్లాడుతూ తమ తండ్రి పోలీస్‌గా విధులు నిర్వర్తించారని, పోలీసు కష్టాలు తమకు తెలుసునన్నారు. పీటీసీ మౌలిక సదుపాయాల కల్పనలో ఇవి ఎంతగానో దోహద పడతాయని పీటీసీ వైస్ ప్రిన్సిపాల్ కోటిరెడ్డి పేర్కొన్నారు. హుందాయ్ మొబిస్ లిమిటెడ్ హెచ్ఆర్‌జీఏ హెచ్ఓడీ పీఎస్.శ్రీనివాస్, ఏజీఎం కమ్ సీఎస్ఆర్ ఇంచార్జి సింధూజ, పీటీసీ సీఐ శుభకుమార్, టి.వేణుగోపాల్ పాల్గొన్నారు.

స.హ. చట్టం బ్రహ్మాస్త్రం

అనంతపురం కల్చరల్: సమాచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలో బ్రహ్మాస్త్రమని దానిపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక రామనగర్‌లోని రాయలసీమ కోఆపరేటివ్ ట్రైనింగ్ సెంటర్‌లో సమాచార హక్కు చట్టంపై సహకార శాఖ సిబ్బందికి ఒకరోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. డీసీఓ అరుణకుమారి, సమాచార హక్కు పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షుడు హొన్నూరప్ప, ఉపాధ్యక్షుడు కవి రామలింగమయ్య తదితరులు సమాచార హక్కు చట్టం ప్రాధాన్యతపై మాట్లాడారు. ఏ ప్రభుత్వ శాఖ అయినా సమాచారాన్ని నిబంధనల మేరకు అందించాలన్నారు. కార్యక్రమంలో సహచట్టం పరిరక్షణ సంఘం సభ్యులు, సహకార శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అన్యాక్రాంతమైన భూమిని కాపాడాలి

అనంతపురం రూరల్: అనంతపురం రూరల్ మండలం ఇటుకలపల్లి రెవెన్యూ గ్రామంలోని అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని కాపాడాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు నాగేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్డీఓ కేశవనాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ ఇటుకలపల్లిలోని సర్వే నంబర్ 248లోని దాదాపు 10 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందన్నారు. ఇతర గ్రామాలకు చెందిన వారికి పాసు పుస్తకాలు అందించడంతో వారు ప్రభుత్వ భూమిలో వెంచర్లు ఏర్పాటు చేసి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. అన్యాక్రాంతమైన భూమిపై విచారణ చేపట్టి పేదలకు ఇంటి పట్టాలను పంపిణీ చేయాలన్నారు. సీపీఎం నాయకులు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'సీస్' బకాయి సొమ్ము విడుదల చేయండి

అనంతపురం ఎడ్యుకేషన్: ఎంపిక చేసిన 3,6,9 తరగతుల విద్యార్థులకు 2023 నవంబరులో నిర్వహించిన 'స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే' (సీస్)కు సంబంధించిన బకాయిలను విడుదల చేయాలని ఎంఈఓ–2 అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం అసోసియేషన్ రాష్ట్ర సలహాదారు హెచ్.రామచంద్ర, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ హెచ్.గురుప్రసాద్, పెద్దవడుగూరు ఎంఈఓ–2 ఓబుళపతి తదితరులు ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డి, సమగ్రశిక్ష ఏఎస్‌పీడీ రవీంద్రారెడ్డి, స్టేట్ ఏఎంఓ నాగేశ్వరరావును కలిసి ఎంఈఓ–2ల సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.

గేట్‌లో అనంత ప్రతిభ



హేమంత్‌రెడ్డిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి

అనంతపురం: గేట్ (గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూట్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్)లో జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్సెస్ విభాగానికి చెందిన విద్యార్థి పి. హేమంత్ రెడ్డి జాతీయ స్థాయిలో 7వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు, ఓఎస్డీటూ వీసీ ప్రొఫెసర్ దేవన్న, రిజిస్ట్రార్ కృష్ణయ్య, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మాధవి, కంప్యూటర్ సైన్సెస్ విభాగాధిపతి కేఎఫ్ భారతి అభినందించారు.

రైతులను ఆదుకోండి

అనంతపురం అగ్రికల్చర్: అకాల వర్షాలకు ఇటీవల పంటలు దెబ్బతిన్న ఉద్యాన రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, జిల్లా పండ్లతోటల రైతుల సంఘం నాయకులు వి.శివారెడ్డి, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం నాయకులతో కలిసి స్థానిక ఉద్యానశాఖ కార్యాలయంలో హెచ్ఓ పద్మావిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 1,540 హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో పంటలు దెబ్బతిన్నాయన్నారు. రైతు సంఘం నాయకులు బీహెచ్ రాయుడు, సంజీవరెడ్డి, బాలరంగయ్య, నాగేంద్రకుమార్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్త ఆరోపణలు!

- పసలేని వాదనతో పల్చనవుతున్న టీడీపీ
- గత ప్రభుత్వంలో కంపోస్టు యార్డులో చెత్త నిర్వహణకు చర్యలు
- రూ.22.9 కోట్లతో టెండర్
- ఇప్పటి వరకు రూ.9.79 కోట్లు మాత్రమే చెల్లింపు
- అయినా అవినీతి జరిగిందంటూ ఆరోపణలు
- విచారణ చేసుకోవాలంటున్న మేయర్ వసీం



బయోమైనింగ్ చేస్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: బయోమైనింగ్ విషయంలో చెత్త ఆరోపణలతో టీడీపీ ప్రజల్లో పలచనవుతోంది. ఆరోపణలకు వాస్తవాలకు పొంతన కుదరకపోవడంతో నవ్వుల పాలవుతోంది. ఆగిపోయిన అభివృద్ధి పనుల నుంచి తప్పించుకోవడానికే టీడీపీ చెత్త పాలిటిక్స్‌కు తెరతీసినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి అటకెక్కింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.వెయ్యి కోట్ల అభివృద్ధి జరిగితే..ఈ ప్రభుత్వం ఏర్పాటైన 10 నెలల్లో రూ.40 కోట్ల అభివృద్ధి పనులు ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ఎక్కడ అభివృద్ధిపై ప్రశ్నిస్తుందోనని కూటమి ప్రభుత్వం చెత్త నిర్వహణపై ఆరోపణలు చేస్తున్నట్లు పరిశీలకులు భావిస్తున్నారు. అవాస్తవాలను..వాస్తవాలుగా చిత్రీకరించే ప్రయత్నం తప్ప ప్రజలకు మేలు చేసే ఆలోచన ఏమాత్రం చేయడం లేదని గుర్తు చేస్తున్నారు. బయోమైనింగ్‌లో అవినీతి జరిగిందంటూ నానా యాగీ చేయడం మినహా కూటమి ప్రజాప్రతినిధులు ప్రజలకు ఏమీ చేయడం లేదని చెబుతున్నారు.

ఇంకా రూ.13.3 కోట్లు చెల్లించాలి..

నోవాస్ గ్రీన్ సంస్థకు ఇప్పటి వరకు మూడు దశల్లో మొత్తం రూ.9.87 కోట్లు నగరపాలక సంస్థ చెల్లించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నగరపాలక సంస్థ కమిషనర్‌గా పీవీవీఎస్ మూర్తి ఉన్న సమయంలో రూ.1.75 కోట్లు, కమిషనర్ భాగ్యలక్ష్మి రూ.3.9 కోట్లు చెల్లించారు. కూటమి ప్రభుత్వంలో ఐఏఎస్ అధికారి మేఘస్వరూప్ కమిషనర్‌గా ఉన్న సమయంలో రూ.4.22 కోట్లు చెల్లించారు. ప్రస్తుతం రూ.2.23 కోట్ల చెల్లింపులు ప్రాసెస్‌లో ఉన్నాయి. ఇవిపోనూ ఇంకా 13.3 కోట్లు చెల్లించాల్సి ఉంది.

బురదజల్లే ప్రయత్నం

వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అభివృద్ధిని ఓర్వలేని కూటమి ప్రభుత్వం ప్రజాప్రతినిధులు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అవినీతి జరిగి ఉంటే విచారణ చేయించాలని మేయర్ వసీం బహిరంగంగా సవాల్ విసిరినా..కూటమి ప్రభుత్వం ప్రజాప్రతినిధులు వెనుకంజ వేస్తున్నారు. అవినీతి..అవినీతి అంటూ చెప్పడం తప్ప విచారణకు వెళ్లకుండా..ఇంకా సదరు కంపెనీకి బిల్లు చేయాలంటూ పరోక్షంగా సంకేతాలు ఇస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

ఇదీ వాస్తవం

అనంతపురం నగరపాలక సంస్థ చరిత్రలో గత 30 నుంచి 40 ఏళ్లుగా కంపోస్టు యార్డుతో గుత్తి రోడ్డు, రాజీవ్‌కాలనీ, ఎర్రనేల కొట్టాలు, తదితర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. రోజు రోజుకు టన్నుల కొద్దీ చెత్త పేరుకుపోవడంతో దుర్వాసనతో పాటు చెత్తను ఎక్కడ వేయాలో తెలియని పరిస్థితి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవతో బయోమైనింగ్ ద్వారా చెత్త నిర్వహణ చేపట్టాలని నిర్ణయించారు. కంపోస్టు యార్డులో 3,32,485 టన్నుల చెత్త ఉన్నట్లు నిర్ధారించారు. ఆ చెత్త నిర్వహణ చేపట్టడానికి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ 2021 జనవరిలో టెండర్లను ఆహ్వానించింది. టెండర్‌లో మెట్రిక్ టన్ను రూ.800తో కోట్ చేయంగా నోవాస్ గ్రీన్ అనే కంపెనీ 13 శాతం లెస్‌తో మెట్రిక్ టన్ను రూ.689 చేసేందుకు ముందుకొచ్చింది. కాగా సదరు ఏజెన్సీకి కేంద్ర ప్రభుత్వం 33 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 22 శాతం, నగరపాలక సంస్థ 45 శాతం చెల్లించాల్సి ఉంది. కాగా సదరు కంపెనీ 2023 జనవరికి చెత్త నిర్వహణ పూర్తి చేసినట్లు అధికారులు ధ్రువీకరించారు.

రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా అందిస్తున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: రాంనగర్‌లోని క్యాన్ పెట్రోల్ బంక్ ఆవరణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పేద ముస్లిం ప్రజలకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి రంజాన్ తోఫా మంగళవారం పంపిణీ చేశారు. సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నియాజ్‌ను అనంత అభినందించారు. అనంతరం అనంత వెంకటరామిరెడ్డిని ముస్లిం మైనార్టీలు సన్మానించారు.

విజ్ఞానయాత్రకు విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: సైన్స్ ఎక్స్‌పోజర్ విజిట్‌లో భాగంగా జిల్లాకు చెందిన 131 మంది విద్యార్థులు, 13 మంది గైడ్ టీచర్లు రెండోవిడత విజ్ఞానయాత్రకు మంగళవారం చిత్తూరు జిల్లా కుప్పం ఆగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సెంటర్‌కు బయలుదేరి వెళ్లారు. రాత్రి 9 గంటలకు జిల్లా సైన్స్ సెంటర్ నుంచి మూడు ఆర్టీసీ బస్సుల్లో బయలుదేరారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబుకు విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు విజ్ఞానయాత్రను విజయవంతంగా ముగించుకుని రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సైన్స్ అధికారి బాల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం

అనంతపురం కార్పొరేషన్: ముస్లింల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని మేయర్ వసీం హెచ్చరించారు. మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ముస్లింలకు రూ.5 లక్షలు రుణాలు, హజ్ యాత్రకు వెళ్లే వారికి రూ.లక్ష, దుల్హన్ పథకం ద్వారా వివాహం చేసుకున్న వారికి రూ.లక్ష అందిస్తామని కూటమి నాయకులు ప్రకటించారన్నారు. అయితే 10 నెలలవుతున్నా వాటి అమలుపై స్పష్టత ఇవ్వడం లేదన్నారు. ఇమామ్, మౌజన్లకు పెండింగ్ ఉన్న గౌరవ వేతనాన్ని వచ్చే ఏడాది రంజాన్‌కు ఇస్తారా అని ఎద్దేవా చేశారు. రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లే అవకాశం లేకుండా ఎంబార్కేషన్ పాయింట్‌ను తొలగిస్తూ జీఓ ఇచ్చినా కూటమి నేతలు, టీడీపీలో ప్రజాప్రతినిధులుగా కొనసాగుతున్న మైనార్టీలు పాయింట్‌ను కొనసాగించే ప్రయత్నం చేయకపోవడం దారుణమన్నారు. హజ్ యాత్రకు సంబంధించి ఒక్కొక్కరికి రూ.83,000 అదనపు భారం పడుతుంటే ఆ భారాన్ని ప్రభుత్వమే భరించేలా గతంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. ఇందుకోసం అప్పట్లో రూ.14.51 కోట్లు విడుదల చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వానికి ముస్లింల పట్ల చిత్తశుద్ధి ఉంటే వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించాలని సవాల్ విసిరారు.



మాట్లాడుతున్న మేయర్ వసీం

పీఎఫ్ సమస్యలు పరిష్కరించండి

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్(పీఎఫ్) సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఏపీటీఎఫ్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంగళవారం అనంతపురం జెడ్పీ కార్యాలయంలోని పీఎఫ్ విభాగం ఏఓలు విజయభాస్కర్‌రెడ్డి, ఉషారాణి, శ్రీవాణిని కలసి వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ పీఎఫ్ మంజూరులో జాప్యం, సీఎఫ్ఎంఎస్ అప్‌లోడ్‌లో జరుగుతున్న ఆలస్యంతో కారణంగా తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

ఆస్తి పన్నుపై 50 శాతం వడ్డీ మాఫీ

అనంతపురం కార్పొరేషన్: ఆస్తి పన్ను 2024–2025కు సంబంధించి బకాయి పడిన మొత్తాన్ని ఒకేసారి చెల్లిస్తే..వడ్డీపై 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు కమిషనర్ బాలస్వామి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

'తమ్ముళ్ల' హంగామా

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట తెలుగు తమ్ముళ్లు హంగామా చేశారు. పోలీసుల వివరాల మేరకు.. మండల కేంద్రంలో బేల్దారు లింగమయ్య అనే వ్యక్తి కూలి పనులకు రావాలని బేల్దార్ రాము, నాగేశ్వరికి రూ.2 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చాడు. అయితే వీరు ఆరోగ్యం బాగలేదని కొద్ది రోజుల నుంచి పనికి వెళ్లలేదు. దీంతో తన డబ్బు ఇవ్వాలని బేల్దార్ లింగమయ్య డిమాండ్ చేశాడు. ఇంటి వద్దకు వచ్చి డబ్బు ఇవ్వాలని బెదిరిస్తున్నాడని బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు లింగమయ్య స్టేషన్‌కు రావాలని సీఐ కరుణాకర్ సూచించారు. దీంతో స్థానిక టీడీపీ నేత రామయ్యను వెంట పెట్టుకుని లింగమయ్య స్టేషన్‌కు వెళ్లాడు. లింగమయ్యతో సీఐ మాట్లాడుతుండగా మధ్యలో టీడీపీ నాయకుడు రామయ్య కల్పించుకున్నాడు. పోలీస్ స్టేషన్‌లో మీ పెత్తనం ఏంటి అంటూ సీఐ, రామయ్య మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకులు స్టేషన్ ఎదుట బైఠాయించి హంగామా చేశారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పి పంపించేశారు.

విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోండి

ఆత్మకూరు: రైతులు అందరూ రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలని ఏఓ సుచరిత తెలియజేశారు. మంగళవారం తలుపూరు, బి, యాలేరు, మదిగుబ్బ, సనప గ్రామాల్లోని విశిష్ట నంబర్ల నమోదును పరిశీలించారు.

ఉపవాసంతో పుణ్యఫలం



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అనంత

అనంతపురం కల్చరల్: రంజాన్‌లో చేసే ఉపవాసంతో పుణ్యఫలం లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి స్థానిక ఆరో రోడ్డులోని హాజర మసీదులో కార్పొరేటర్ రహంతుల్లా ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందుకు మాజీ ఎమ్మెల్యే హాజరయ్యారు. కార్పొరేటర్లు ఇషాక్, శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్లు ఏకేఎస్ ఫయాజ్, నార్పల సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం నగరాధ్యక్షుడు మన్సూర్, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నియాజ్ అహ్మద్, యూత్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు సాకే చంద్ర, చంద్రశేఖరయాదవ్, నాయకులు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకన కేంద్రంలో వసతులు కల్పించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి మూల్యాంకన కేంద్రంలో అన్ని వసతులు కల్పించాలని ఫోర్టో నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక సైన్స్ సెంటర్‌లో డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఫోర్టో నాయకులు మాట్లాడుతూ దీర్ఘ కాలిక జబ్బులతో బాధపడుతున్న ఉపాధ్యాయులను మూల్యాంకనం నుంచి మినహాయించాలన్నారు. ఫోర్టో రాష్ట్ర చైర్మన్ కరణం హరికృష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెద్దన్న, జిల్లా చైర్మన్ శ్రీనివాసులు, ఎస్ఎల్‌టీఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై. ఆదిశేషయ్య, జి వేణుగోపాల్ ఎన్టీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. గోపాల్, డీటీడబ్ల్యూఏ ప్రధాన కార్యదర్శి నెట్టెం వెంకటేశులు, ఏపీ ఎస్ ఏపీఈఏ రాష్ట్ర నేతలు నరసింహారెడ్డి, ప్రభాకర్, ఆంజనేయులు, శ్రీనివాసరెడ్డి తదితరులున్నారు.

వాహనాల వేలం

అనంతపురం సెంట్రల్: రవాణాశాఖలో సీజ్ చేసిన వాహనాలకు మంగళవారం ఉప రవాణా కమిషనర్ వీర్రాజు అధ్యక్షతన వేలం నిర్వహించారు. వేలం ద్వారా రూ. 4,84, 500 ఆదాయం వచ్చినట్లు డీటీసీ తెలిపారు.

కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

కదిరి టౌన్: స్థానిక పీఎస్‌లో స్పెషల్ పార్టీ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మురళి మంగళవారం రాత్రి ఆత్మహత్యాయత్నం చేశాడు. రాప్తాడు మండలం జంగాలపల్లికి చెందిన మురళి... కదిరి మున్సిపాలిటీ పరిధిలోని మూర్తిపల్లి సచివాలయ మహిళా పోలీసుగా పనిచేస్తున్న ఓడీసీ మండలం డబురువారిపల్లికి చెందిన కల్పనను ప్రేమించి ఆరు నెలల క్రితం పెళ్లి చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో గ్రూప్ 1 పరీక్షలకు సిద్ధమైన ఆమెను కోచింగ్ కోసం రెండు నెలల క్రితం అనంతపురానికి పంపాడు. పరీక్ష రాసిన తర్వాత నేరుగా పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి భర్తతో దూరంగా ఉంటూ వచ్చింది. పలుమార్లు కాపురానికి రావాలని పిలిచినా ఆమె అంగీకరించకపోవడంతో మనస్తాపం చెందిన మురళి... మంగళవారం రాత్రి వైఎస్సార్ నగర్‌లో తాను నివాసముంటున్న ఇంట్లోనే పురుగులు మందు సేవించాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆయనను పక్కింటి వారు గమనించి, వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి రెఫర్ చేశారు.



చికిత్స పొందుతున్న మురళి

ఆందోళన పడొద్దు..అండగా ఉంటాం

- విద్యారణ్యనగర్ వాసులకు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి భరోసా



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: తరాల తరబడి ఇళ్లను నిర్మించుకుని కాపురాలు ఉంటున్న అనంతపురం రూరల్ మండలం విద్యారణ్యనగర్ వాసులెవరూ ఆందోళన చెందొద్దని, అందరికీ వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి భరోసా ఇచ్చారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు పాపంపేట 106–1 సర్వే నంబరులోని 68 సెంట్లలోని నిర్మాణాలను తొలగిస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై హైకోర్టు స్టేటస్ కో ఇచ్చిన నేపథ్యంలో మంగళవారం తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆ ప్రాంతంలో పర్యటించారు. బాధితులతో పాటు చుట్టుపక్కల ఉన్నవారు ప్రకాష్‌రెడ్డిని కలిసి భయాందోళనలు వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఉన్నవారందరూ పేదలేనని కూలినాలి చేసుకుని కుటుంటాలు నెట్టుకొస్తున్నామని వాపోయారు. ఇళ్ల విషయంలో ఏరోజు ఏమి జరుగుతుందోననే భయం ఉందన్నారు. 51–7 సర్వే నంబరులో ఉన్న ఇళ్లకు మూడేళ్ల కిందట నోటీసులు ఇచ్చారని ఇప్పుడు వాటిని కూడా తొలగిస్తారంటూ భయపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరూ భయపడొద్దని ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఏది ఉన్నా చట్టపరంగా పోరాడదామన్నారు. అందుకయ్యే ఖర్చులు తానే భరిస్తానన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఇలాంటి ఉత్తర్వులను హైకోర్టు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పటి కలెక్టర్‌తో ప్రత్యేకంగా మాట్లాడి రెవెన్యూ అధికారుల నుంచి పూర్తిస్థాయి ఆధారాలతో కౌంటరు దాఖలు చేయడంతో ఆ ప్రక్రియ ఆగిపోయిందన్నారు. ఫిర్యాదుదారుడు మరోమారు కోర్టును ఆశ్రయించడంతో ఇటీవల కోర్టు మళ్లీ తీర్పు ఇచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం దీనిపై కౌంటరు దాఖలు చేయలేకపోయిందన్నారు. ఈ ఫలితమే ఈరోజు ఇన్ని ఇళ్లను తొలిగించారన్నారు. రూ.30 కోట్ల విలువైన ఈ స్థలంపై కన్నేయడంతోనే అధికార పార్టీకి చెందిన వారెవరూ నోరు మెదపడం లేదన్నారు. తానుమాత్రం పేదలకు అండగా ఉంటూ పోరాడతానన్నారు. రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పవన్, ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్వర్లు, సందీప్‌యాదవ్, స్థానిక నాయకులు మాదన్న, మునిశంకరయ్య, కుమ్మెత గోపాల్‌రెడ్డి, గోపి, ఎర్రిస్వామి, అంజనరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

'విద్యుత్ షాకులు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం అర్బన్: ట్రూఅప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీలు, స్మార్ట్‌మీటర్ల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలు మోపటానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప అన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల విషయంలో కూటమి ప్రభుత్వం తీరు ఏరు దాటిన తర్వాత తెప్ప తగలేసిన చందంగా ఉందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై మోసిన విద్యుత్ భారంపై 'విద్యుత్ షాకులు' టైటిల్‌తో సీపీఎం ఆధ్వర్యంలో రూపొందించిన బుక్‌లెట్‌ను మంగళవారం అనంతపురంలోని సప్తగిరి సర్కిల్ ఆటో స్టాండ్ వద్ద పార్టీ నాయకులతో కలసి ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు నియంత్రిస్తామని, విద్యుత్ బిల్లుల భారం తగ్గిస్తామని తమ మేనిఫెస్టోలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పెద్దలు పేర్కొన్నారన్నారు. ప్రతి ఎన్నికల సభలోనూ చంద్రబాబు ఇదే విషయాన్ని గట్టిగా చెప్పారన్నారు. ఇక నారా లోకేష్ అయితే తన యువగళం పాదయాత్రలో 2023, జూలై 2న నెల్లూరు వేదికగా ప్రసంగిస్తూ స్మార్ట్ మీటర్లు పగులగొట్టాలని పిలుపునిచ్చారని గుర్తు చేశారు. అధికారులు వచ్చి సంతకం చేయమంటే చేయొద్దని, రైతులకు అండగా ఉంటామని భరోసానూ ఇచ్చారన్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకేసి స్మార్ట్ మీటర్లు వద్దంటూ అప్పట్లో హైకోర్టును ఆశ్రయించారని గుర్తు చేశారు. అధికారం చేపట్టిన తర్వాత కూటమి పెద్దలు మాట మార్చి ఈ తొమ్మిది నెలల్లోనే రూ.15,450 కోట్ల విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపారని మండిపడ్డారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, నాగేంద్రకుమార్, నగర కార్యదర్శి రామిరెడ్డి, కమిటీ సభ్యులు రామాంజినేయులు, ముత్తుజా, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.


పిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్

రాప్తాడురూరల్: 18 ఏళ్లలోపు పిల్లలపై ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడినా పోక్సో చట్టం కింద అరెస్ట్ చేస్తారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి శివప్రసాద్‌యాదవ్ హెచ్చరించారు. మంగళవారం చిన్నకుంట ఎస్టీ కాలనీలో 'పోక్సో చట్టం'పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. జడ్జి శివప్రసాద్‌యాదవ్ మాట్లాడుతూ 18 ఏళ్లలోపు పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడం, అత్యాచారాలకు పాల్పడడం, ఈవ్‌టీజింగ్ చేయడం, మానసికంగా శిక్షించడం లాంటివన్నీ పోక్సో చట్టం కిందకు వస్తాయన్నారు. 2012లో చైల్డ్ ప్రొటెక్షన్ యాక్ట్ వచ్చిందని, ఇది చాలా శక్తివంతమైందన్నారు. నాన్‌బెయిలబుల్, అరెస్ట్ వారెంట్ ఉంటుందన్నారు. ఈ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ దివాకర్, తహసీల్దార్ మోహన్‌కుమార్, సీఐ హేమంత్‌కుమార్, ఈఓఆర్డీ వెంకటనాయుడు, సచివాలయ ఉద్యోగులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

కనిపించని ఆస్తి మేధో సంపత్తి



సయ్యద్ హుసేన్‌సాహెబ్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

అనంతపురం ఎడ్యుకేషన్: మేధో సంపత్తి అనేది కంటికి కనిపించని ఆస్తి అని ఎస్కేయూ లా విభాగం ఫ్యాకల్టీ డాక్టర్ సయ్యద్ హుసేన్ సాహెబ్ పేర్కొన్నారు. స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల ఐఐసీ ఆధ్వర్యంలో మంగళవారం 'ప్రొటెక్టింగ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్'పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సయ్యద్ హుసేన్ సాహెబ్ మాట్లాడుతూ మనుషులు సృష్టించే ఆవిష్కరణ, సాహిత్య, కళాత్మక పని, డిజైన్లు, చిహ్నాలు (సింబల్స్), పేర్లు, చిత్రాలు వంటి వాటికి వ్యక్తుల మనసు, తెలివితేటలు ప్రాణం పోస్తాయన్నారు. వీటి సృష్టికి సంబంధించిన ఐడియాలు కంటికి కనిపించవన్నారు. ఈ ఐడియాలనే మేధో సంపత్తి అంటారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ మేధస్సు, తెలివితేటల ద్వారా మనుషులు సృష్టించిన వస్తువులు, ఇతర కష్టార్జితంపై అన్ని హక్కులు దాని సృష్టికర్తకే ఉంటాయన్నారు. మన దేశంలో చాలా రకాల మేధో సంపత్తి హక్కులు అమల్లో ఉన్నాయన్నారు. కాపీరైట్, పేటెంట్లు, ట్రేడ్‌మార్క్‌లు, ట్రేడ్ సీక్రెట్లు వంటివన్నీ ఇందులో భాగమేనన్నారు. ప్రస్తుతం చాలా దేశాల చట్టాల్లో మేధో సంపత్తి హక్కులను చేర్చారన్నారు. కళాశాల ఏఓ శ్రీనాథ్, వాణిజ్య విభాగం అధ్యాపకులు టి.వినయ్ కుమార్, ఎం.పోతలయ్య, జీఎం.అనిల్ కుమార్, విశ్వతేజ, ఐఐసీ మెంబెర్ యస్.రిజ్వానా బేగం పాల్గొన్నారు.

సాంకేతిక సదస్సులో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర

అనంతపురం: ఈ నెల 21, 22వ తేదీల్లో ఎస్వీ యూనివర్సిటీలో నిర్వహించిన 'క్రైడార్ –25' జాతీయ సాంకేతిక సదస్సులో ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈమేరకు కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర విద్యార్థులను అభినందించారు. పేపర్ ప్రజెంటేషన్‌లో సివిల్ విభాగం సెకండియర్ విద్యార్థులు ఎం. నాగేశ్వరరావు (స్ట్రక్చరల్ ఇంజినీరింగ్)లో మొదటి బహుమతి, మూడో సంవత్సరం చదువుతున్న ఎం. ఆశ్రియ, కే. కావ్య (హైడ్రాలిక్ స్ట్రక్చర్)విభాగంలో మొదటి బహుమతి దక్కించుకున్నారు. టెక్నికల్ క్విజ్ పోటీల్లో మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జే. వెంకటేశ్ మొదటి బహుమతి, కే. కావ్య రెండో బహుమతి సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఉత్కంఠగా ఏపీ సూపర్‌కప్

అనంతపురం: ఆర్డీటీ క్రీడా గ్రామంలో ఏపీ సూపర్‌కప్ ఫుట్‌బాల్ పోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి. ఈ నెల 27న ఫైనల్ మ్యాచ్ నిర్వహిస్తున్నట్లు ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం జరిగిన టోర్నీలో వంశధార, పెన్నా, కొల్లేరు జట్లు గెలుపొందాయి. వంశధార–తుంగభద్ర జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో వంశధార మూడు గోల్స్ సాధించగా, తుంగభద్ర జట్టు ఒక గోల్ కూడా సాధించలేదు.

- పెన్నా, విశాఖ జట్ల మధ్య జరిగిన పెన్నా రెండు గోల్స్, విశాఖ మూడు గోల్స్ సాధించింది.
- నల్లమల– కొల్లేరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కొల్లేరు మూడు గోల్స్, నల్లమల ఒక గోల్ కూడా సాధించలేదు
- కోరమాండల్– గోదావరి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో గోదావరి రెండు గోల్స్, కోరమాండల్ ఒక గోల్ కూడా సాధించలేదు.



లేడీ బౌన్సర్స్‌కు
అడ్డే లేదు

స్త్రీలను కొన్ని ఉపాధుల్లోకి రానీకుండా అడ్డుకుంటారు. అడ్డుకునేవారిని అడ్డుకుంటాం అంటున్నారు ఈ లేడీ బౌన్సర్లు. కొచ్చి, పూణె, ఢిల్లీ, ముంబైలలో లేడీ బౌన్సర్లకు గిరాకీ పెరిగింది. సెలబ్రిటీలను గుంపు నుంచి అడ్డుకుని వీరు కాపాడుతారు. స్పోర్ట్స్, మార్షల్ ఆర్ట్స్, బాడీ బిల్డింగ్ తెలిసిన స్త్రీలు ఈ రంగాన్ని ఎంచుకుంటున్నారు. రోజుకు రెండు వేల వరకూ ఫీజు. వివాహితలూ ఉన్నారు. వివరాలు...

ఎనిమిది గంటలు డ్యూటీ. తీసుకెళ్లడం తీసుకు రావడం ఏజెన్సీ పని. భోజనం ఉంటుంది. బయట ఊర్లయితే రూము కూడా ఇస్తారు. రోజుకు రెండు వేల నుంచి రెండు వేల ఐదు వందలు సంపాదన. చేయాల్సిన పని?

- క్రౌడ్‌ను కంట్రోల్ చేయడం
- ఈవెంట్ సెక్యూరిటీ
- సెలబ్రిటీల రక్షణ
- సెలబ్రిటీలను ఎయిర్‌పోర్ట్ నుంచి రిసీవ్ చేసుకోవడం
- సంపన్నుల వేడుకల్లో హంగామా కోసం
- ప్రయివేటు సమస్యల్లో రక్షణ

ఇటీవల ఒక సినీ నటుడి ఇంటి గొడవల్లో బౌన్సర్లనే మాట ఎక్కువగా వినిపించింది. పోలీసుల రక్షణ వీలుగాని చోట ప్రముఖులు బౌన్సర్ల సాయం తీసుకోవడం సాధారణం అయ్యింది. ఒకప్పుడు పబ్‌లలో తాగి గొడవ చేసే వారి కోసం మాత్రమే బౌన్సర్లు ఉండేవారు. ఇప్పుడు అన్ని సేవలకు వారిని ఉపయోగిస్తున్నారు. సెక్యూరిటీకి మాత్రమే కాదు దర్పం చూపించడానికి కూడా శ్రీమంతులు బౌన్సర్లను వాడుతున్నారు. ఉదాహరణకు కలవారి పెళ్లిళ్లలో వరుడు/వధువు కల్యాణ వేదికకు వచ్చేప్పుడు వరుసదీరిన బౌన్సర్లు చెరో పక్క నడుస్తూ బిల్డప్ ఇస్తున్నారు. చూసేవారికి ఇది గొప్పగా ఉంటుంది. వేడుకలకు, బిజినెస్ మీటింగ్స్‌కు వచ్చే అతిథుల కోసం ఎయిర్‌పోర్ట్‌కు బౌన్సర్లను పంపుతున్నారు. కాలేజీ వేడుకలు, ప్రారంభోత్సవాలు, ఔట్‌డోర్ షూటింగ్‌లు... వీటన్నింటికీ బౌన్సర్లు కావాలి. ఎంతమంది బౌన్సర్లుంటే అంత గొప్ప అనే స్థితికి సెలబ్రిటీలు వెళ్లారు. దాంతో వీరి సేవలను సమకూర్చే ఏజెన్సీలు నగరాల్లో పెరిగాయి. మహిళా బౌన్సర్లు కూడా పెరిగారు.



ఇబ్బందిగా మొదలయ్యి...

'మొదట ప్యాంటూ షర్టు వేసుకున్నప్పుడు ఇబ్బందిగా అనిపించింది. ఇంట్లో వాళ్లు కొత్తగా చూశారు. ఇరుగుపొరుగు వారు వింతగా చూశారు. కాని తరువాత అలవాటైపోయింది' అంది పూణెకు చెందిన ఒక మహిళా బౌన్సర్. 2016లో దేశంలోనే మొదటిసారిగా మహిళా బౌన్సర్ల ఏజెన్సీ ఇక్కడ మొదలైంది. ఆ తర్వాత ఢిల్లీ, ముంబై, బెంగళూరులలో ఇలాంటివి వచ్చాయి. ఇప్పుడు కేరళలో ఈ రంగంలోకి వస్తున్నవారు పెరిగారు. 'మేము ఎవరినో రక్షించడానికి వెళుతుంటే మా రక్షణ కోసం కొత్తల్లో కుటుంబ సభ్యులు ఆందోళన పడేవారు. కాని స్త్రీలు ఈ రంగంలో సురక్షితంగా పని చేయొచ్చని నెమ్మదిగా అర్థం చేసుకున్నారు' అని మరో బౌన్సర్ అంది.

రెండు విధాలా ఆదాయం

కొచ్చిలో 'షీల్డ్ బౌన్సర్స్ ఏజెన్సీ'కి చెందిన మహిళా బౌన్సర్లు వేడుకలకు ప్రధాన ఆకర్షణగా మారారు. ఈవెంట్స్‌లో మహిళా అతిథులకు, స్టేజ్ రక్షణకు, అతిథుల హోటల్ నుంచి ఈవెంట్ వద్దకు తీసుకు రావడానికి వీరి సేవలు ఉపయోగిస్తున్నారు. 'సాధారణంగా ఈవెంట్స్ సాయంత్రాలు ఉంటాయి. బౌన్సర్ల పని అప్పటి నుంచి మొదలయ్యి అర్ధరాత్రి వరకూ సాగుతుంది. కాబట్టి పగటి పూట చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ లేదా ఇంటి పనులు చక్కబెట్టుకుంటూ మధ్యాహ్నం తర్వాత ఈ పని చేస్తున్నవారూ ఉన్నారు. దాంతో రెండు విధాల ఆదాయం ఉంటోంది' అని ఆ ఏజెన్సీ నిర్వాహకుడు తెలిపాడు.

స్పోర్ట్స్ తెలిసినవారు

స్కూల్, కాలేజీల్లో స్పోర్ట్స్‌లో చురుగ్గా ఉన్న మహిళలు, వ్యాయామం ద్వారా జిమ్ ద్వారా దేహాన్ని ఫిట్‌గా ఉంచుకున్నవారు, మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్న వారు మహిళా బౌన్సర్లుగా రాణిస్తారు. వెంటనే వారికి పని దొరికే పరిస్థితి ఉంది. దేశంలోని నగరాల్లో వివాహితలు, పిల్లలున్న తల్లులు కూడా వృత్తిలో రాణిస్తున్నారు. 'జనాన్ని అదుపు చేయడం, వారిని ఒప్పించి ఇప్పుడే దూరంగా జరపడం, ఆకతాయిలను కనిపెట్టడం, సెలబ్రిటీలతో వ్యవహరించే పద్ధతి తెలియడం, చట్ట పరిధిలో గొడవలను అదుపు చేయడం తెలిస్తే ఈ వృత్తి లాభదాయకం' అంటున్నారు ఈ మహిళా బౌన్సర్లు.

బ్యూటిప్
మొటిమలు, మచ్చలు పోవాలంటే...





ముఖంపై మృతకణాలను ఎప్పటికప్పుడు తొలగించుకోకుంటే మొటిమలు, మచ్చలు లాంటి సమస్యలు తలెత్తుతాయి. అలా కాకుండా ఉండాలంటే ఇంట్లో ఆరోగ్యకరమైన స్క్రబ్‌ను తయారు చేసుకోవచ్చు. అందుకు మూడు టీస్పూన్ల బేకింగ్ సోడాలో ఒక టీస్పూన్ ఓట్స్ వేసి కొన్ని నీళ్లతో మెత్తని పేస్ట్‌లా చేసుకోవాలి. రోజూ ఆఫీసు నుంచి ఇంటికి రాగానే ఈ మిశ్రమంతో ముఖాన్ని స్క్రబ్ చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

వియ్ హబ్ బ్రాండ్ అంబాసిడర్
వంట గెలిచింది

ఆమె... వంటతో జీవితాన్ని నిలబెట్టుకుంటానని, వంటలతో అవార్డులు అందుకుంటానని, వియ్ హబ్ (విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ హబ్)కి బ్రాండ్ అంబాసిడర్ అవుతానని కలలో కూడా కలగనలేదు. పాలతో కూరలు వండే గుజరాత్ వాళ్లు ఆమె చేసిన పుదీనా పచ్చడిని లొట్టలేసుకుంటూ తిన్నారు. కొబ్బరి, అరటితో మసాలాలు లేని తేలిక ఆహారం తీసుకునే కేరళ వాసులు కూడా ఆమె చేతి రుచికి ఫిదా అయ్యారు. గోవా వాళ్లకు చేపలతో కొత్త వంటలను పరిచయం చేశారామె. ఈ విజయాలన్నీ ఆమెను రాష్ట్ర సెక్రటేరియట్ వైపు నడిపించాయి. తెలంగాణ సెక్రటేరియట్‌లో క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. ఆమె పేరు ఆకుల కృష్ణకుమారి. ఊరు మేడ్చల్ - మల్కాజ్‌గిరి జిల్లా, మూడు చింతలపల్లి గ్రామం. నెలకు లక్షకు పైగా ఆర్జిస్తున్న కృష్ణకుమారి జీవితం పలువురికి స్ఫూర్తిదాయకం.



కృష్ణకుమారి

కృష్ణకుమారి గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత ఒక ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా ఉద్యోగం చేశారు. ఆ తర్వాత కొంతకాలం ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో ఫ్రంట్ ఆఫీసర్. తనకు వంటలు చేయడం, వంటల్లో ప్రయోగాలు చేయడం ఇష్టం. ఆ ఇష్టంతో తాను చేసిన కొత్త వంటకాలను కొలీగ్స్‌కి ఇచ్చేవారామె. "మా నాన్న టైలర్. ఓ రోజు సెర్ప్ (సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ) డీపీఎమ్ సురేఖ గారు మా షాప్‌కి వచ్చారు. నన్ను చూసి నేను చేస్తున్న పని తెలిసిన తర్వాత ఆమె నాకో డైరెక్షన్ ఇచ్చారు. ఆ ధైర్యంతోనే నా కుటీర పరిశ్రమ మొదలైంది. తొలి ఆర్డర్ యూఎస్‌కి, డాక్టర్ గీతాంజలి మేడమ్ పది వేల రూపాయల ఆర్డర్ ఇచ్చారు. అలా మొదలైన నా జర్నీ ఇప్పుడు నెలకు లక్ష రూపాయలకు పైగా ఆదాయంతో విజయవంతంగా సాగుతోంది. మిల్లెట్స్‌తో ప్రయోగాలు నన్ను నిలబెట్టాయి.'' అన్నారు కృష్ణకుమారి.



మహిళాశక్తి క్యాంటీన్

డ్వాక్రా స్వయంసహాయక బృందంలో చేరిన తర్వాత తన కార్యకలాపాలను వేగవంతం చేశారు కృష్ణకుమారి. హైదరాబాద్, రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చరల్ యూనివర్సిటీలో ఎన్ఐఆర్‌డీలో శిక్షణ తీసుకోవడంతో పాటు, తన ఉత్పత్తులకు ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికేషన్ వంటి ప్రక్రియలన్నీ పూర్తి చేసుకున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే ఎగ్జిబిషన్‌లలో స్టాల్ పెట్టడంతో మొదలైన ఆమె జర్నీ సరస్ మేళా ఎగ్జిబిషన్‌లతో అండమాన్, కశ్మీర్ మినహా దేశమంతటికీ విస్తరించింది. ఆమె విజయపథం... ఎగ్జిబిషన్‌లో స్టాల్ కోసం అధికారులను అడగాల్సిన దశ నుంచి ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాల్లో స్టాల్ పెట్టవలసిందిగా కలెక్టర్ ఆఫీస్ నుంచి ఫోన్ కాల్ వచ్చే దశకు చేరింది.

చిన్న రైతులే

నా ఉత్పత్తులకు స్వాద్ అనే బ్రాండ్‌నేమ్ రిజిస్టర్ చేశాను. పరిశ్రమ దమ్మాయిగూడలో ఉంది. ఆరుగురు మహిళలు పని చేస్తున్నారు. నేను ఉదయం తొమ్మిదిన్నరకు సెక్రటేరియట్‌కు చేరుకుంటాను. తిరిగి ఇంటికి చేరేటప్పటికి రాత్రి పదవుతుంది. యూనిట్‌లో నిన్న తయారైన మెటీరియల్‌ను ఈ రోజున కౌంటర్‌లో పెడతాను. ఏ రోజుకారోజు అమ్ముడైపోతాయి. సెక్రటేరియట్ క్యాంటీన్‌తోపాటు యూనిట్‌లోనే అవుట్‌లెట్ కూడా ఉంది. రాపిడో ద్వారా సప్లయ్ చేస్తున్నాం. వినియోగదారులు మా దగ్గరకు రావడం కంటే మేమే వినియోగదారుల దగ్గరకు వెళ్లాలనే ఉద్దేశంతో మొబైల్ యూనిట్ ప్రారంభించనున్నాను. నా సక్సెస్‌కి కారణం తోటలే. పచ్చళ్లు, పొడులు ఏవి చేయాలన్నా కూరగాయలు మార్కెట్ నుంచి తెచ్చుకోను. నేరుగా తోటలకే వెళ్లి తెచ్చుకుంటాను. భారీ స్థాయిలో పండించే వాళ్లు స్వయంగా మార్కెట్‌కు తరలించగలుగుతారు. చిన్న రైతులు తమకు తాముగా మార్కెట్‌కి తీసుకెళ్లాలంటే ఆ ఖర్చులు భరించలేరు. నేను వారి దగ్గర తీసుకుంటాను. నేను ఇష్టంతో ఎంచుకున్న ప్రొఫెషన్. నాకు ఉపాధినివ్వడంతోపాటు గుర్తింపును కూడా తెచ్చింది. ఇందులోనే భవిష్యత్తును నిర్మించుకుంటాను. మహిళల కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు మహిళలకు తెలియడం లేదు. ప్రభుత్వ పథకాల గురించి మహిళలకు అవగాహన కల్పించడం కోసం పని చేస్తాను.

– ఆకుల కృష్ణకుమారి, స్వాద్ ఫుడ్స్





తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గత ఏడాది జూన్ నెల రెండవ తేదీన జరిగిన వేడుకల్లో ఆమె స్టాల్ పెట్టారు. ఆ స్టాల్‌లోని ఉత్పత్తులను ఆసాంతం పరిశీలించిన మంత్రులు, ముఖ్యమంత్రి ఆమె అక్కడికక్కడే లైవ్ కౌంటర్‌లో వండిన తెలంగాణ రుచులకు కూడా సంతృప్తి చెందారు. డ్వాక్రా మహిళల కోసం శాశ్వతంగా ఒక వేదికను ఏర్పాటు చేయవలసిందిగా కోరడంతో 'సెక్రటేరియట్ క్యాంటీన్ మహిళలకే ఇద్దాం' అని నోటిమాటగా వచ్చిన ఉత్తర్వుతో అదే నెల 21న ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్ మొదలైంది. అందులో కృష్ణకుమారితో పాటు పదిమంది మహిళలు తమ ఉత్పత్తులను విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. జయహో మహిళాశక్తి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

లీగల్
పెళ్లి సంగతి తర్వాత... కౌన్సెలింగ్ ఇప్పించండి

మా అక్క తన విడాకుల అనంతరం మాతోనే ఉంటున్నారు. తనకి ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురి వయసు 29 సంవత్సరాలు. గత ఎనిమిది సంవత్సరాలుగా పెళ్లి సంబంధాలు చూస్తున్నాము. 2023వ సంవత్సరంలో ఒక అబ్బాయి పెళ్లి చూపులకు వచ్చినప్పుడు "నేను మరొకరిని ప్రేమిస్తున్నాను అని చెప్పింది'' కానీ ఆ అబ్బాయి వివరాలు ఇవ్వలేదు. మేమే ఎలాగోలా అతని ఫోన్ నెంబర్ తెలుసుకుని అబ్బాయిని సంప్రదించగా తనకు జాబ్ వచ్చిన తరువాత మాత్రమే తమ ప్రేమ విషయం ఇంట్లో చెప్తాను అన్నాడు. తన కుటుంబ వివరాలు కూడా మాకు ఇవ్వలేదు. వారిది వైజాగ్ అని మాత్రమే తెలుసు. అమ్మాయిని వేరే సంబంధం చేసుకోమంటే మా మాట వినటం లేదు. ఎలా అయినా సరే అతన్నే పెళ్లి చేసుకుంటాను అంటుంది. ఇలా అయితే లాభం లేదు, ఇంట్లో నుంచి వెళ్లిపొమ్మని గట్టిగా చెప్పాము. అయినా లాభం లేదు. ఇటీవలే అబ్బాయికి ఉద్యోగం వచ్చినట్లు తెలిసింది కానీ, తర్వాత నుంచి మా మేనకోడలితో కూడా మాట్లాడడం మానేశాడు. మా అక్కకి ఆ అబ్బాయితో సంబంధం ఇష్టం లేదు. పరిష్కారం చూపగలరు.

– విజయ, హైదరాబాద్

మీ మేనకోడలు ఒక మేజర్. చట్టప్రకారం తను ఎవరిని పెళ్లి చేసుకోవాలి – ఎవరితో కలిసి బతకాలి, అసలు పెళ్లి చేసుకోవాలా వద్దా అనేది పూర్తిగా తన వ్యక్తిగత నిర్ణయం పైనే ఆధారపడి ఉంటుంది. అందులో మూడో వ్యక్తి జోక్యం చేసుకోవటాన్ని చట్టం అంగీకరించదు.అది తల్లిదండ్రులైనా సరే! ఏమి చేసినా ఆ అమ్మాయి అంగీకారంతో మాత్రమే చేయవలసి ఉంటుంది. మీరు చెప్పినదాన్ని బట్టి చూస్తే ఆ అబ్బాయికి ఇంక ఇంట్రెస్ట్ లేనట్టు కనిపిస్తుంది. బహుశా మీ అమ్మాయి ఈ విషయం జీర్ణించుకున్నట్లు లేదు. తనకు కౌన్సెలింగ్ అవసరం అనిపిస్తుంది. మీ అమ్మాయి అతన్ని మాత్రమే పెళ్లి చేసుకుంటాను అనడానికి గల కారణం ఏమిటో ప్రేమగా మాట్లాడి తనకి ధైర్యాన్ని ఇస్తూ కనుక్కోండి. పరస్పర అంగీకారంతో ప్రేమించుకున్నట్టైతే సరేం అలా కాదు ఏదైనా వేరే కోణం ఉందేమో తెలుసుకోండి. శారీరక సుఖం కోసం ప్రేమిస్తున్నాను అంటూ వెంటపడుతూ కోరిక తీరినాక మోసపూరితంగా వదిలేస్తే, అందుకు తగిన శిక్షలు భారతీయ న్యాయ సంహితలో వున్నాయి. కఠిన చర్యలు తీసుకోవచ్చు. ఏది ఏమైనా, ఈ సమయంలో మీరు తనపై మరింత ఒత్తిడి పెట్టడం సరైనది కాదు. మీరు కలిగించే ధైర్యం–నమ్మకం తనకు చాలా అవసరం. కాబట్టి పెళ్లి సంగతులు కాసేపు పక్కనబెట్టి ముందు తన మానసిక పరిస్థితి, తనకు ఏం కావాలి అనే అంశాలను తెలుసుకునే ప్రయత్నం చేయండి. వీలైతే కౌన్సెలింగ్ ఇప్పించండి.



- శ్రీకాంత్ చింతల
హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

సేవాపథం
పేదోళ్ల వకీలమ్మ



సరళ మహేందర్‌రెడ్డి

'న్యాయవాది కావడం అనేది కేవలం వృత్తికి సంబంధించిన విషయం మాత్రమే కాదు. ప్రజల విశ్వాసాన్ని చూరగొనడం... సమాజానికి తిరిగి ఇవ్వాల్సిన బాధ్యత తను ఎప్పుడూ గుర్తు పెట్టుకోవడం కూడా' అనే ప్రసిద్ధ మాటను న్యాయవాదుల గురించి చెబుతుంటారు.

నిజామాబాద్‌కు చెందిన కాటిపల్లి సరళ మహేందర్‌రెడ్డి న్యాయవాదిగా పేదలకు అండగా ఉండటమే కాదు...'సమాజానికి తిరిగి ఇవ్వాలి' అనే ఎరుకతో తన పాఠశాల ద్వారా పేద విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తోంది. పిల్లలు వివిధ ఆటల్లో జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేస్తోంది.

డిగ్రీ చదువుతున్నప్పుడే వివాహం అయినప్పటికీ భర్త, హైకోర్ట్ న్యాయవాది మహేందర్‌రెడ్డి ప్రోత్సాహంతో ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన సరళ నిజామాబాద్ జిల్లా కోర్టులో ఎన్‌రోల్ అయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొదటి మహిళా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేసింది. ఉమ్మడి ఏపీ హైకోర్టులో ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా విశాఖ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల బాధ్యతలు చూసింది.

రోడ్డు ప్రమాదంలో మరణించిన తన బావగారు (భర్త అన్న) కాటిపల్లి రవీందర్‌రెడ్డి పేరుమీద ఎడ్యుకేషనల్ సొసైటీ ఏర్పాటు చేసి నర్సరీ నుంచి పదో తరగతి వరకు ఉచిత విద్యను అందిస్తున్నారు. బీఈడీ కళాశాలను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 300 మంది పేద విద్యార్థులకు ఉచితంగా విద్యనందించారు. ఈ ఏడాది నుంచి 'బాలసదన్'లో ఉంటున్న 30 మంది అనాథ పిల్లలకు ఉచితంగా విద్యనందిస్తున్నారు. 'బాలసదన్' చిన్నారుల కోసం జిల్లా జడ్జి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'భవిష్య జ్యోతి' ట్రస్ట్‌కు చైర్‌పర్సన్‌గా సరళ మహేందర్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు.

సామాజిక సేవే... విలువైన సంపద

న్యాయవాదిగా పేదలకు అండగా నిలవడమే కాదు సామాజికసేవా కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొంటున్నందుకు సంతోషంగా ఉంది. భవిష్యత్‌లో మరిన్ని సేవాకార్యక్రమాల్లో భాగం కావాలనుకుంటున్నాను.

– సరళ మహేందర్‌రెడ్డి



ఆటల్లో మెరిసేలా...

గ్రామీణ విద్యార్థులను ఆటల్లో ప్రోత్సహించేందుకు 'ఖేలో ఇండియా' కార్యక్రమాలు పాఠశాల ద్వారా నిర్వహిస్తున్నారు. ఖోఖో ఆటలను స్పాన్సర్ చేస్తున్నారు. ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు హాకీలో జాతీయ స్థాయిలో ఆడారు. రెండు సార్లు రాష్ట్రస్థాయి జూడో మీట్ నిర్వహించారు. స్కూల్ విద్యార్థులు జూడోలో రాష్ట్రస్థాయిలో అండర్–17 విభాగంలో 3 కాంస్య పతకాలు సాధించారు. జూనియర్స్, సబ్ జూనియర్స్ సైతం జూడో రాష్ట్ర స్థాయిలో ఆడుతున్నారు.

– తుమాటి భద్రారెడ్డి,
సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

గ్లోబల్ టు లోకల్

జర్మన్ అమ్మాయి... మలయాళం ఎంత చక్కగా మాట్లాడిందో!


విదేశాలకు వెళ్లడం, కొత్త కొత్త ప్రదేశాల్లో విహరించడం బాగానే ఉంటుంది కానీ భాషా సమస్యలు ఇబ్బంది పెడుతుంటాయి. కొందరు వేరే దేశాల్లో నివసిస్తున్నప్పటికీ స్థానిక భాషలు వారికి ఎప్పుడూ పరాయిగానే ఉండిపోతాయి.

ఎందుకంటే వారు ఎప్పుడూ మాట్లాడరు... మాట్లాడాలని ప్రయత్నించరు!

'నేర్చుకోవాలనే తపన ఉంటే... ఏ భాష అయినా మాట్లాడవచ్చు' అని చెప్పే వీడియో ఒకటి సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది.

క్లారా అనే జర్మనీ అమ్మాయి కొంత కాలంగా మన దేశంలో నివసిస్తోంది. ఆమె ఉబర్ క్యాబ్ డ్రైవర్‌తో స్పష్టమైన మలయాళంలో మాట్లాడుతున్న వీడియో క్లిప్ చూసి నెటిజనులు 'ఆహా' అంటున్నారు.

'ఇంగ్లీష్ మాట్లాడే ఫారినర్స్‌నే చూశాను గానీ ఇంత చక్కగా మలయాళం మాట్లాడే ఫారినర్‌ను చూడడం ఇదే మొదటిసారి' అని క్యాబ్‌డ్రైవర్ బోలెడు ఆశ్చర్యపోయాడు.




ఆర్ట్ అండ్ కల్చర్
పాకిస్థాన్‌లో... ప్యార్ కియాతో డర్నా క్యా!

దేశాల మధ్య ఎంత దూరమైనా ఉండవచ్చు. ఎంత శత్రుత్వమైనా ఉండొచ్చు. అయితే కళకు ఆ దూరం తెలియదు. ఆ శత్రుత్వం తెలియదు.

'మొఘల్–ఎ–ఆజం' అనే సినిమా పేరు వినగానే ఒళ్లు పులకరించిపోతుంది. కాలాతీతమైన ప్రేమ కావ్యం ఇది. ఈ సినిమాకు మన దేశంలో ఎంత ఆదరణ, అభిమానం ఉందో పాకిస్థాన్‌లోనూ అంతే. పాక్‌లో ఈతరం ప్రేక్షకులు కూడా ఈ సినిమాను సొంతం చేసుకోవడం విశేషం. తాజా విషయానికి వస్తే...

పాకిస్థాన్‌లోని గవర్నమెంట్ కాలేజీ యూనివర్శిటీ (జిసియూ) విద్యార్థుల బృందం ఈ ఐకానిక్ చిత్రానికి నీరాజనం అర్పించింది.

'మొఘల్–ఎ–ఆజం' సినిమాను నాటకంగా ప్రదర్శిస్తే ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన ఇంతా అంతా కాదు!



'మొఘల్–ఎ–ఆజం' చిత్రంలో ఓ సన్నివేశం